www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
21 నవంబర్ 2026
సంపుటి:4 సంచిక: 313

విశాల భారతి

తెలుగు దినపత్రిక

మెడికల్ టూరిజంలో గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

- హైదరాబాద్‌కు గ్లోబల్ మెడికల్ హబ్ హోదా
- హెల్త్‌కేర్‌పై ప్రభుత్వ మాస్టర్ ప్లాన్
- నాలుగు ఆస్పత్రుల్లో ఇంటర్నేషనల్ వార్డులు
- మెడికల్ టూరిజానికి ప్రత్యేక విభాగం
- ప్రభుత్వ వైద్యులకు ఉచిత శిక్షణ



02

తెలంగాణ కా బాద్షా కేసీఆర్ మాత్రమే

రేవంత్ రెడ్డి వన్ టైమ్ వండర్ లీడర్

- తెలంగాణలో అభివృద్ధి కంటే క్రైమ్ పెరిగిందని వ్యాఖ్యలు
- బిల్డర్ల నుంచి 10 శాతం వసూలు చేస్తున్నారని ఆరోపణ
- రేవంత్, అమిత్ షా మధ్య రహస్య ఒప్పందాలున్నాయని విమర్శ
- కేసీఆర్‌ను లివింగ్ లెజెండ్‌గా అభివర్ణించిన కేటీఆర్
- 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా



విశాలభారతి, స్టేట్ బ్యూరో: హైదరాబాద్‌లో ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహిస్తున్న 'సదరన్ రైజింగ్ సమ్మిట్-2026' వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి పనితీరుకు మార్కులు వేయాల్సి వస్తే ఢిల్లీ పర్యటనలు, కాంగ్రెస్ పెద్దలకు సేవలు చేయడం, ప్రజలను మోసం చేయడంలో మిగతా 2లో..



కేసీఆర్ ఓ రావణాసురుడు

కేటీఆర్ అసలు పోటీనే కాదు.. రేవంత్ రెడ్డి

బీఆర్ఎస్ నేతలు ఫూల్స్ ప్యారడైజ్‌లో ఉన్నారని విమర్శ
అమిత్ షాకు హైదరాబాద్ నుంచి పోటీ చేయాలని సవాల్
డీలిమిటేషన్‌తో దక్షిణాది ప్రాధాన్యం తగ్గుతుందని ఆందోళన
65 శాతం హామీలు అమలు చేశామని రేవంత్‌రెడ్డి వెల్లడి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

బీఆర్ఎస్ నేతలు ఊహల్లో బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండాలనే ఉద్దేశంతోనే ఆ పార్టీని కొనసాగనిస్తున్నామని, లేదంటే ఎప్పుడో ఖాళీ చేసేవాళ్లమని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో కేసీఆర్ ప్రోత్సహించిన పార్టీ ఫిరాయింపులే ఇప్పుడు ఆయనకు ఇబ్బందిగా మారాయని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంలోని ఆ పార్టీ నాయకత్వానికి సవాల్ విసిరారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీజేపీ డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో తమకు బలమైన పట్టు ఉందని చెప్పుకునే బీజేపీ నేతలు ఎన్నికల ఫలితాలను గుర్తించాలని వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు నిజంగా రాజకీయ ధైర్యం ఉంటే హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని సవాల్ చేశారు. అక్కడ మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని ఓడించి బీజేపీ సత్తా నిరూపించుకోవాలని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదుగుతామని బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. జాతీయ స్థాయిలో పెద్ద పార్టీ అయినంత మాత్రాన రాష్ట్ర రాజకీయాల్లో అదే స్థాయిలో ప్రభావం ఉంటుందని భావించకూడదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా పార్లమెంట్ స్థానాలను 50 శాతం పెంచే ప్రతిపాదనలో కేవలం జనాభానే ప్రామాణికంగా తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఉత్తర భారతదేశంలో జనాభా ఎక్కువగా ఉండటంతో అక్కడ మిగతా 2లో..

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రావణాసురుడితో పోలుస్తూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారాయి. హైదరాబాద్‌లో ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన సదరన్ రైజింగ్ సమ్మిట్ నాలుగో ఎడిషన్‌లో పాల్గొన్న ఆయన ప్రతిపక్ష నేతలపై ఘాటు విమర్శలు చేశారు. తన రాజకీయ పోరాటంలో కేసీఆర్ మాత్రమే ప్రధాన ప్రత్యర్థి అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అసలు పోటీగానే భావించనని వ్యాఖ్యానించారు. తండ్రి రాజకీయ వారసత్వంతో మేనేజ్‌మెంట్ కోటాలో నాయకుడైన కేటీఆర్ గురించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు.


రూ.6 కోట్ల నిధులు మంజూరైనా

బేతోలుకు భద్రత కరువేనా?



- ప్రజల ప్రాణాల కంటే అధికారులకు ఫైళ్లే ముఖ్యమా?
- ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ లైన్
- ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బీసీ కాలనీవాసుల బెంబేలు
- నిధులున్నా లైన్ షిఫ్టింగ్ ఎందుకు చేపట్టడం లేదు?
- మున్సిపల్, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై మాజీ వార్డు సభ్యుడు షేక్ ఖాదర్ బాబా ఆగ్రహం

03



క్యాన్సర్ రోగులకు కష్టాలు

- ఎంఎన్‌జేలో మూడు నెలలుగా మల్టీవిటమిన్లు, పెయిన్ కిల్లర్లు కరువు
- జోఫర్ వంటి కనీస ఔషధాలకూ కొరత
- వైద్యశాలలో సీటీ స్కాన్ ఫిల్మ్‌లు, కాంట్రాస్ట్ ఇంజెక్షన్లు సైతం లేవు

05

భారత్ పరువు తీస్తున్నారా?



- విదేశాల్లో భారత్ పరువు తీస్తున్నారంటూ రాహుల్‌పై కిషన్‌రెడ్డి ఫైర్
- వరుస ఓటములు ఎదురైనా కాంగ్రెస్‌కు బుద్ధి రావడం లేదని విమర్శ
- భారత ఆర్థిక వ్యవస్థపై రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన కిషన్‌రెడ్డి
- దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ కుమ్మక్కయ్యారని ఆరోపణ
- మేకిన్ ఇండియాతో ఉత్పత్తులు పెరిగాయని వెల్లడి
- మోదీ పాలనలో ప్రపంచ దేశాల్లో భారత్ ప్రభావం పెరిగిందని వ్యాఖ్య

03



అసెంబ్లీలో నిన్ను బట్టలిప్పి నిలబెడతా

- అసెంబ్లీ పెడితే ప్రభుత్వ వైఫల్యాలు బయటపెడతానని హరీశ్‌రావు సవాల్
- కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని విమర్శ
- 299 టీఎంసీల వాటాపై రాజీనామా సవాల్ విసిరిన హరీశ్‌రావు
- ప్రాజెక్టుల మోటార్లు నడపకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ
- కేసీఆర్ హయాంలోని సంక్షేమ పథకాలను నిలిపేశారని విమర్శ
- తనపై పోటీ చేయాలని రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్

03

రాజీపడిన ప్రధాని

- ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ సమావేశంపై రాహుల్ విమర్శలు
- కాంగ్రెస్ అధికారంలో ఉంటే టేబుల్ వద్ద భారత్ ఉండేదని వ్యాఖ్య
- రాజీపడిన ప్రధాని ఆ స్థానం పొందలేరంటూ మోదీపై విమర్శ
- సిమ్లా ఒప్పందంపై కాంగ్రెస్‌ను బీజేపీ ప్రశ్నించింది
- షర్మ్-ఎల్-షేక్ ప్రకటన, చైనా ఒప్పందంపై ఆరోపణలు
- భారత్‌ను కించపరిచేందుకే రాహుల్ వ్యాఖ్యలని బీజేపీ ఎదురుదాడి



విశాలభారతి, జాతీయం:

ప్రపంచ రాజకీయాల్లో అగ్రరాజ్యాల మధ్య జరిగే ప్రతి సమావేశం అంతర్జాతీయ సమీకరణాలను ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా అమెరికా, చైనా, రష్యా వంటి మూడు శక్తివంతమైన దేశాల అధినేతలు ఒకే వేదికపైకి వస్తే ఆ పరిణామాలకు మరింత ప్రాధాన్యత ఏర్పడుతుంది. తాజాగా చైనాలోని షెన్‌జెన్ వేదికగా డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్, షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశం కూడా ఇలాంటి చర్చలకే కారణమైంది. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేయడంతో భారత రాజకీయాల్లో కొత్త వివాదం మొదలైంది. ఈ ముగ్గురు అగ్రనేతల పక్కన భారత ప్రధానమంత్రి కూడా ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే భారత ప్రధాని ఆ టేబుల్ వద్ద కూర్చొని ఉండేవారని వ్యాఖ్యానించారు. అంతేకాదు, రాజీపడిన ప్రధానమంత్రి ఎప్పటికీ అలాంటి అంతర్జాతీయ వేదికపై స్థానం సంపాదించలేరంటూ మోదీ నాయకత్వాన్నినేరుగా లక్ష్యంగా చేసుకున్నారు. దీంతో ఒక అంతర్జాతీయ సమావేశం కాస్తా దేశీయ రాజకీయ పార్టీల మిగతా 2లో..

అధికార అహంకారంతో మాట్లాడొద్దు



- ముఖ్య నేతలు హుందాగా మాట్లాడాలని రాజగోపాల్‌రెడ్డి సూచన
- అధికారం ఉందని అహంకారంతో వ్యవహరించొద్దని హెచ్చరిక
- అవినీతికి పాల్పడే పాలకులను ప్రజలు క్షమించరని వ్యాఖ్య
- ప్రజావసరాలను విస్మరిస్తే చరిత్ర క్షమించదని విమర్శ
- ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని హితవు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాజకీయాల్లో మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. ఉన్నత పదవుల్లో ఉన్న నాయకులు మాట్లాడేటప్పుడు హుందాతనం పాటించాలని, బాధ్యత మరిచి వ్యవహరించకూడదని ఆయన ఘాటుగా సూచించారు. అధికారం చేతిలో ఉందని అహంకారంతో ప్రవర్తిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. అయితే తన ప్రకటనలో ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించలేదు. అయినప్పటికీ ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించినవేనే చర్చ మొదలైంది. ముఖ్యంగా సొంత పార్టీ ఎమ్మెల్యే నుంచే ఇలాంటి వ్యాఖ్యలు రావడం కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. అధికారంలో ఉన్నవారు ప్రజలకు జవాబుదారీగా ఉండాలనే సందేశాన్ని రాజగోపాల్ రెడ్డి తన ప్రకటన ద్వారా బలంగా వినిపించారు. అదృష్టం కలిసొచ్చి అధికారం దక్కిందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చివరకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హెచ్చరించారు. ముఖ్యంగా అవినీతికి పాల్పడుతూ ప్రజల అవసరాలను పట్టించుకోని పాలకులను తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదని స్పష్టం చేశారు. చరిత్రలో కూడా అలాంటి నాయకులకు మిగతా 3లో..

రేఖానాయక్ ఇంట్లో ఈడీ సోదాలు

- సీఎంఆర్ బియ్యం అక్రమాలపై అధికారుల విచారణ
- ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసంలో ఈడీ సోదాలు
- 9,639 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత.. విలువ రూ.40.96 కోట్లు
- రేఖానాయక్‌పై నిత్యావసర సరుకుల చట్టం కింద కేసు నమోదు
- రాష్ట్రవ్యాప్తంగా 3 వేల రైస్ మిల్లుల్లో అక్రమాల గుర్తింపు
- సీఎంఆర్ అక్రమాల విలువ రూ.6,700 కోట్లు ఉంటుందని అంచనా

02



మెడికల్ టూరిజంలో గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



హైదరాబాద్‌ను అంతర్జాతీయ వైద్య రంగంలో మరో స్థాయికి తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న హైదరాబాద్.. ఇకపై మెడికల్ టూరిజంలోనూ గ్లోబల్ హబ్‌గా ఎదగాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. విదేశాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులకు అత్యాధునిక చికిత్సలు, నాణ్యమైన వైద్య సేవలు అందించే కేంద్రంగా నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించి గ్లోబల్ సమ్మిట్ వేదికగా హెల్త్‌కేర్ రంగానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించే దిశగా అడుగులు వేస్తోంది. ఆరోగ్య రంగంలో తెలంగాణను ప్రపంచానికి ఆదర్శంగా నిలబెట్టాలంటే కేవలం ప్రభుత్వ ప్రయత్నాలు మాత్రమే సరిపోవని, ప్రైవేటు ఆసుపత్రులు, వైద్య నిపుణులు కూడా భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. సెక్రటేరియట్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాలపై కీలక చర్చ జరిగింది. వాస్తవానికి మెడికల్ టూరిజం అనేది కేవలం విదేశీ రోగులకు చికిత్స అందించడం మాత్రమే కాదు. ఒక రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు తీసుకొచ్చే కీలక రంగం. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్యం అందుబాటులో ఉండటం, అనుభవజ్ఞులైన డాక్టర్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆసుపత్రులు ఈ రంగంలో ప్రధాన బలాలు. హైదరాబాద్‌కు ఇప్పటికే ఈ అంశాల్లో గణనీయమైన సామర్థ్యం ఉంది. కార్డియాక్ చికిత్సలు, అవయవ మార్పిడి, న్యూరో సర్జరీ, క్యాన్సర్ చికిత్సలు, ఆర్థోపెడిక్ సేవల కోసం దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు విదేశాల నుంచి కూడా రోగులు వస్తున్నారు. ఈ అవకాశాలను మరింత విస్తరించి, అంతర్జాతీయ రోగులకు హైదరాబాద్‌ను నమ్మకమైన వైద్య గమ్యస్థానంగా మార్చాలన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్య వనరులను ఒకే లక్ష్యం కోసం సమన్వయం చేయగలిగితే హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. అయితే దీనికి వైద్య నాణ్యత తోపాటు రోగులకు అందించే మొత్తం సేవల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలు అవసరం. ఈ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సనత్‌నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్‌తోపాటు నిమ్స్, అల్వాల్ టిమ్స్, కొత్తపేట టిమ్స్‌లలో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం వార్డులను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. దీనివల్ల ప్రభుత్వ వైద్య రంగంలో ఉన్న అత్యాధునిక సదుపాయాలను కూడా అంతర్జాతీయ రోగులకు అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రయత్నం కనిపిస్తోంది. సాధారణంగా విదేశాల నుంచి వచ్చే రోగులకు చికిత్సతోపాటు వీసా సంబంధిత సహాయం, ఆసుపత్రిలో అడ్మిషన్, భాషాపరమైన సహకారం, వసతి, చికిత్స అనంతర సంరక్షణ వంటి అనేక అవసరాలు ఉంటాయి. వీటన్నింటినీ సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరం. ఈ నేపథ్యంలో ఆరోగ్యశాఖలో మెడికల్ టూరిజం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సమావేశంలో పాల్గొన్న వైద్యులు సూచించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అంతర్జాతీయ రోగులకు అవసరమైన సేవలన్నీ ఒకే వ్యవస్థ ద్వారా అందించే విధానం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవస్థ సక్రమంగా అమలైతే విదేశీ రోగులకు హైదరాబాద్‌లో వైద్యం పొందడం మరింత సులభమవుతుంది. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు వైద్య రంగాల మధ్య సహకారాన్ని పెంచే దిశగా కూడా కీలక ప్రతిపాదనలు వచ్చాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ముందుకొచ్చారు. ముఖ్యంగా జాయింట్ రీప్లేస్‌మెంట్, న్యూరో సర్జరీ, కార్డియో థొరాసిక్ సర్జరీ వంటి ప్రత్యేక విభాగాల్లో ప్రభుత్వ సర్వీసులో కొత్తగా చేరే వైద్యులకు ఉచిత శిక్షణ అందించేందుకు సిద్ధమని కిమ్స్‌సన్‌సైన్ ఎండీ డాక్టర్ గురువా రెడ్డితోపాటు ఇతర వైద్యులు ప్రకటించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో హానరరీ ప్రొఫెసర్లుగా కూడా సేవలందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనకు మంత్రి సానుకూలంగా స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యుత్తమ వైద్యం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేటు రంగంలో ఉన్న అనుభవం, వైద్య నైపుణ్యాలను ప్రభుత్వ వైద్య వ్యవస్థకు అనుసంధానం చేసుకుంటామని తెలిపారు. ఈ సహకారం వల్ల కొత్తగా వైద్య వృత్తిలోకి వచ్చే డాక్టర్లకు ప్రత్యేక నైపుణ్యాలు పెరగడంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అధునాతన చికిత్సలు అందించే సామర్థ్యం పెరుగుతుంది. అయితే హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం గ్లోబల్ హబ్‌గా మార్చాలంటే ప్రకటనలు, సమావేశాలు, మాస్టర్ ప్లాన్లతోనే లక్ష్యం పూర్తికాదు. క్షేత్రస్థాయిలో పటిష్టమైన అమలు, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, నిపుణులైన వైద్య సిబ్బంది, పారదర్శకమైన చికిత్సా విధానాలు కీలకం కానున్నాయి. ముఖ్యంగా విదేశీ రోగులకు చికిత్స ఖర్చుల విషయంలో స్పష్టత, వైద్య సేవల నాణ్యత, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భద్రత, చికిత్స అనంతర పర్యవేక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు అందే సేవల నాణ్యత తగ్గకుండా మెడికల్ టూరిజం కార్యక్రమాలను నిర్వహించడం కూడా ముఖ్యమైన బాధ్యత. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలిసి పనిచేస్తే వైద్య విద్య, పరిశోధన, వైద్య నైపుణ్యాల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయి. తద్వారా హైదరాబాద్ కేవలం దేశీయ రోగులకే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వైద్యం కోరుకునే వారికి ఒక ప్రధాన కేంద్రంగా ఎదిగే అవకాశం ఉంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం వేసిన ఈ అడుగులు ఆచరణలో ఎంత వేగంగా ముందుకు సాగుతాయన్నదే ఇప్పుడు కీలకం. ప్రణాళికలు కార్యరూపం దాల్చితే హైదరాబాద్‌కు అంతర్జాతీయ వైద్య పటంలో ప్రత్యేక స్థానం దక్కడంతోపాటు తెలంగాణ ఆరోగ్య రంగానికి కూడా కొత్త దిశ ఏర్పడే అవకాశం ఉంది.



కేసీఆర్ ఓ రావణాసురుడు


మొదటిపేజీ తరువాయి

పార్లమెంట్ సీట్లు భారీగా పెరిగే అవకాశ ముందని వివరించారు. అదే జరిగితే దక్షిణాది ఎంపీల మద్దతు లేకుండానే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి రావచ్చన్నారు. జనాభా నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించిన రాష్ట్రాలకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజనలో రాష్ట్రాల జీడీపీ, జనాభా రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రానికి సూచించారు. దేశ ఆర్థికాభివృద్ధికి దక్షిణాది రాష్ట్రాలు అందిస్తున్న సహకారానికి తగిన రాజకీయ ప్రాధాన్యం ఉండాలని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తన రాజకీయ ప్రయాణం గురించి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. విద్యార్థి దశలో ఏబీవీపీతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. తర్వాత వివిధ రాజకీయ దశలను దాటుకుని కాంగ్రెస్ పార్టీలో చేరానని వివరించారు. దేశ భవిష్యత్తుకు రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని భావించే ఆ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రాజకీయాల్లో కుటుంబ వారసత్వం కాకుండా సొంత కష్టంతో ఎదిగానని పేర్కొన్నారు. 17 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని తెలిపారు. తనకు ప్రత్యేకంగా రాజకీయ టీమ్ అవసరం లేదని, తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలే తన బలమని వ్యాఖ్యానించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని అభివృద్ధి కోసం ఉపయోగించుకుంటున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో 65 శాతం హామీలను అమలు చేసిందని, మిగిలిన కార్యక్రమాలను వచ్చే రెండేళ్లలో పూర్తిచేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగానే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను రూపొందించినట్లు చెప్పారు. దేశ మొత్తం జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రముఖ అంతర్జాతీయ ఆటగాళ్లను తెలంగాణకు తీసుకురావడంపై దృష్టిపెట్టినట్లు చెప్పారు. ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీని ఇప్పటికే తెలంగాణకు తీసుకువచ్చామని, భవిష్యత్తులో మరో దిగ్గజ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డోను కూడా రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. రాజకీయ విమర్శలకు సమాధానం ఇవ్వడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిపై తమ ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల ముందుంచడమే ముఖ్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

రాజీపడిన ప్రధాని!

మొదటిపేజీ తరువాయి

మధ్య విమర్శల యుద్ధానికి కేంద్రబిందువుగా మారింది. రాహుల్ గాంధీ వ్యాఖ్యల వెనుక ప్రధానంగా భారత విదేశాంగ విధానం, అంతర్జాతీయంగా దేశానికి ఉన్నప్రాధాన్యత అనే అంశాలు కనిపిస్తున్నాయి. అమెరికా, రష్యా, చైనా వంటి దేశాలు ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, భద్రతా వ్యవహారాలను ప్రభావితం చేసే శక్తిని కలిగి ఉన్నాయి. అలాంటి దేశాల మధ్య జరిగే కీలక చర్చల్లో భారత్‌కు కూడా నిర్ణయాత్మక స్థానం ఉండాలని ప్రతిపక్షం కోరుకోవడంలో తప్పులేదు. అయితే ఆ స్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం దక్కలేదని చెప్పాలంటే దానికి బలమైన ఆధారాలు అవసరం. కేవలం ఒక సమావేశానికి సంబంధించిన ఫొటోను ఆధారంగా చేసుకొని ప్రధానమంత్రి నాయకత్వంపై రాజీ అనే ముద్ర వేయడం రాజకీయ విమర్శగా కనిపిస్తోంది. మరోవైపు, భారత్ అంతర్జాతీయంగా తన ప్రయోజనాలను కాపాడుకుంటూ అమెరికా, రష్యా, చైనా దేశాలతో వేర్వేరు అంశాల్లో సంబంధాలను కొనసాగించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రష్యాతో రక్షణ సంబంధాలు, అమెరికాతో వాణిజ్య సహకారం, చైనాతో సరిహద్దు సమస్యలు వంటి అంశాలు భారత విదేశాంగ విధానాన్ని అత్యంత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. అందువల్ల అంతర్జాతీయ వేదికపై భారత్ స్థానం గురించి జరిగే చర్చను కేవలం ప్రధాని మోదీ వ్యక్తిగత ప్రతిష్టకు పరిమితం చేయడం కంటే దేశ ప్రయోజనాల కోణంలో విశ్లేషించడం అవసరం. ఇక రాహుల్ గాంధీ విమర్శలకు బీజేపీ కూడా అంతే ఘాటుగా స్పందించింది. కాంగ్రెస్ గత పాలనలోనే దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడ్డారని బీజేపీ ప్రతినిధి తుహిన్ సిన్హా ఆరోపించారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో జరిగిన సిమ్లా ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ, 1971 యుద్ధం తర్వాత పాకిస్థాన్‌కు చెందిన యుద్ధ ఖైదీల విడుదల విషయంలో భారత్ కీలక నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. అయితే ఆ నిర్ణయం తర్వాత కూడా పాకిస్థాన్ నుంచి భారత్‌కు ఉగ్రవాద ముప్పు కొనసాగిందని విమర్శించారు. అలాగే మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో పాకిస్థాన్‌తో కలిసి విడుదల చేసిన షర్మ్‌ఎల్‌షేక్ సంయుక్త ప్రకటనను కూడా బీజేపీ ప్రస్తావించింది. 2008లో బీజింగ్‌లో కాంగ్రెస్, చైనా కమ్యూనిస్ట్ పార్టీ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని సైతం తెరపైకి తీసుకొచ్చింది. ఈ ఒప్పందం తర్వాత భారత్ సరిహద్దుల్లో చైనా చొరబాట్లు పెరిగాయని బీజేపీ ఆరోపిస్తోంది. అయితే ఈ పరిణామాల మధ్య నేరుగా కారణ సంబంధాన్ని నిర్ధారించకుండా, రాజకీయ ఆరోపణలను చారిత్రక వాస్తవాల నుంచి వేరు చేసి చూడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే విదేశాంగ విధానంలో తీసుకున్న ప్రతి నిర్ణయానికి అప్పటి పరిస్థితులు, వ్యూహాత్మక అవసరాలు కూడా నేపథ్యంగా ఉంటాయి. బీజేపీ వాదన ప్రకారం, 2004 నుంచి 2014 వరకు కొనసాగిన యూపీఏ ప్రభుత్వ కాలంలోనే భారత్ అనేక కీలక అంతర్జాతీయ అంశాల్లో బలహీనమైన వైఖరిని ప్రదర్శించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ దేశం అంతర్జాతీయంగా వెనుకబడిపోయిందంటూ విమర్శలు చేయడం విడ్డూరమని కమలం పార్టీ నేతలు అంటున్నారు. మరోవైపు, మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ దేశాలతో బలమైన సంబంధాలను ఏర్పరచుకుందని, అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రాధాన్యత పెరిగిందని బీజేపీ చెబుతోంది. అయితే ఈ వాదనను కూడా కేవలం దౌత్య సమావేశాలు, విదేశీ పర్యటనలు లేదా అగ్రనేతలతో ఫొటోల ఆధారంగా మాత్రమే అంచనా వేయలేం. సరిహద్దుల భద్రత, వాణిజ్య ఒప్పందాలు, పెట్టుబడులు, రక్షణ సహకారం, అంతర్జాతీయ సంక్షోభాల్లో భారత్ పోషిస్తున్న పాత్ర వంటి అంశాలను పరిశీలించాలి. ముఖ్యంగా చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు, అమెరికాతో మారుతున్న వాణిజ్య సంబంధాలు, రష్యాతో కొనసాగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం సాధించిన ఫలితాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు రెండింటినీ చర్చించాలి. అప్పుడే భారత్ విదేశాంగ విధానంపై సమగ్ర అవగాహన ఏర్పడుతుంది. మొత్తంగా చూస్తే, రాహుల్ గాంధీ చేసిన ఒక్క సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మధ్య పాత రాజకీయ వివాదాలను మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. కాంగ్రెస్ గత పాలనలో తీసుకున్న నిర్ణయాలను బీజేపీ ప్రశ్నిస్తుంటే, ప్రస్తుత ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని కాంగ్రెస్ తప్పుబడుతోంది. కానీ ఈ రాజకీయ విమర్శల మధ్య అసలు చర్చించాల్సిన అంశం మాత్రం భారత్‌కు ప్రపంచ రాజకీయాల్లో ఎలాంటి స్థానం ఉండాలన్నదే. అమెరికా, చైనా, రష్యా వంటి శక్తివంతమైన దేశాలు తమ ప్రయోజనాల కోసం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న సమయంలో భారత్ కూడా స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే శక్తిగా ఎదగాలి. ఏ దేశానికి అనుకూలంగా కాకుండా, భారత ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ అంతర్జాతీయ సంబంధాలను నడిపించగలగాలి.



రేఖానాయక్ ఇంట్లో ఈడీ సోదాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టడం రాజకీయంగా కలకలం రేపింది. ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవహారాల్లో జరిగినట్లు చెబుతున్న భారీ అవకతవకలపై ఈడీ దృష్టిపెట్టింది. ఖానాపూర్, జగిత్యాల ప్రాంతాల్లో గతంలో జరిగిన ధాన్యం లావాదేవీలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల అంశాలు ఈ తనిఖీల్లో కీలకంగా మారాయి. రేఖానాయక్ నివాసంలో అధికారులు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలి. అయితే ఆ ప్రక్రియలో భారీ వ్యత్యాసాలు నమోదైనట్లు ఆరోపణలు రావడంతో దర్యాప్తు వేగం పుంజుకుంది. ఈడీ రంగంలోకి దిగడంతో ఖానాపూర్ రాజకీయ వర్గాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. రేఖానాయక్ రాజకీయ ప్రయాణం కూడా ఈడీ సోదాల నేపథ్యంలో మరోసారి చర్చకు వచ్చింది. ఆమె 2014 నుంచి వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్ తరపున ఖానాపూర్ ఎమ్మెల్యేగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె భర్త శ్యామ్‌నాయక్ గతంలో రవాణా శాఖలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి ప్రవేశించారు. గత ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. ప్రస్తుతం రేఖానాయక్ నివాసంలో కేంద్ర దర్యాప్తు సంస్థ సోదాలు చేపట్టడంతో ఈ కుటుంబానికి సంబంధించిన వ్యాపార వ్యవహారాలపై ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా రైస్ మిల్లుల కార్యకలాపాలు, ప్రభుత్వ ధాన్యం కేటాయింపులు, ఆర్థిక చెల్లింపులు దర్యాప్తులో ప్రధాన అంశాలుగా మారాయి. రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ రైస్‌మిల్లు వ్యవహారంలో భారీ మొత్తంలో ధాన్యం కొరత ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. సత్తెనపల్లిలోని ఈ మిల్లుకు 202223 నుంచి 202425 వరకు కస్టమ్ మిల్లింగ్ కోసం కేటాయించిన ధాన్యంలో 9,639 మెట్రిక్ టన్నుల కొరత నమోదైనట్లు పౌరసరఫరాల శాఖ పేర్కొంది. దీని విలువ సుమారు రూ.40.96 కోట్లుగా అంచనా వేసింది. ఈ వ్యవహారంపై పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సుధాకర్ ఆగస్టు 19న ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రేఖానాయక్‌పై నిత్యావసర సరకుల చట్టం కింద కేసు నమోదైంది. ప్రభుత్వ ధాన్యం బియ్యంగా మారిన తర్వాత ఎంత మేర తిరిగి అప్పగించారు, మిగిలిన నిల్వలు ఎక్కడికి వెళ్లాయి, వాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈడీ సోదాలు ఒక్క రైస్‌మిల్లు వ్యవహారానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వెలుగుచూసిన సీఎంఆర్ అక్రమాల చర్చను మళ్లీ తెరపైకి తెచ్చాయి. తెలంగాణలో సుమారు మూడు వేల రైస్‌మిల్లులకు 202122 నుంచి కేటాయించిన ధాన్యం విషయంలో భారీ అవకతవకలు జరిగినట్లు పౌరసరఫరాల శాఖ గుర్తించింది. మిల్లులకు ఇచ్చిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా దారి మళ్లించారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారాల్లో మొత్తం రూ.6,700 కోట్ల వరకు అక్రమాలు జరిగి ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత దాని వినియోగం, నిల్వలు, తిరిగి అప్పగించిన బియ్యం లెక్కల్లో తేడాలు బయటపడటం దర్యాప్తులో కీలకంగా మారింది. దీంతో ధాన్యం కేటాయింపుల నుంచి తుది చెల్లింపుల వరకు అన్ని లావాదేవీలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎంఆర్ వ్యవహారంలో ఇప్పటికే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి. మొత్తం 26 జిల్లాల్లోని దాదాపు 300 రైస్‌మిల్లుల్లో చేపట్టిన సోదాల్లో రూ.2,196 కోట్ల విలువైన ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించారు. ఈ భారీ వ్యత్యాసాలు బయటపడటంతో దర్యాప్తును మరింత వేగవంతం చేసేందుకు సీఐడీ కూడా రంగంలోకి దిగింది. మరోవైపు తాజాగా మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసంలో ఈడీ సోదాలు జరగడం రైస్‌మిల్లర్లలో ఆందోళన పెంచింది. ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్ బియ్యం, బకాయిలు, ధాన్యం నిల్వల వ్యవహారాలు ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి. ముఖ్యంగా రూ.6,700 కోట్ల స్థాయిలో అక్రమాలు జరిగాయనే అంచనాలు ఈ కేసు తీవ్రతను తెలియజేస్తున్నాయి. దర్యాప్తులో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలు కీలకంగా మారనున్నాయి.



తెలంగాణ కా బాద్షా కేసీఆర్ మాత్రమే

మొదటిపేజీ తరువాయి

పదికి పది మార్కులు ఇవ్వొచ్చని సెటైర్లు వేశారు. రాష్ట్ర సమస్యల కంటే తన గద్దం గురించే ముఖ్యమంత్రి ఎక్కువగా ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో ప్రభావం, రాష్ట్ర అభివృద్ధి వంటి అంశాలపై రేవంత్‌రెడ్డికి పట్టింపు లేదని విమర్శించారు. మూడేళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేశారా అని నిలదీశారు. తెలంగాణ రైజింగ్ అంటూ ప్రచారం చేస్తున్న ప్రభుత్వం వాస్తవంగా ఏ రంగంలో పురోగతి సాధించిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అభివృద్ధి కంటే నేరాలు పెరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు ప్రస్తావిస్తే ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా అవినీతి వ్యవహారాలపై ఘాటు విమర్శలు చేశారు. దేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బదులుగా రేవంత్‌రెడ్డి బ్యాంక్ ఆఫ్ ఇండియా నడుస్తోందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని బిల్డర్ల నుంచి ముఖ్యమంత్రి పది శాతం వాటా తీసుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించినా తెలంగాణ నుంచి డబ్బులు వెళ్తున్నాయని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏటీఎంలా మారారని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి డబ్బుల సంచులు వెళ్తున్నాయని ఆరోపిస్తూ, ఆ ఏటీఎం గడువు 2028 డిసెంబర్‌తో ముగుస్తుందని ఎద్దేవా చేశారు. రామ్‌లీలా మైదానంలో రాహుల్ గాంధీ ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తుంటే, తెలంగాణలో పది మంది ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకున్న రేవంత్‌రెడ్డే అసలైన ఓట్ చోర్ అని విమర్శించారు. ఆయన ఓట్లను కూడా దొంగిలించగలరంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన రేవంత్‌రెడ్డి, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ నాయకత్వాన్ని సంతోషపెట్టడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కూడా కేటీఆర్ వదిలిపెట్టలేదు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు ఉన్నా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇద్దరి మధ్య రహస్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ పైకి ప్రత్యర్థుల్లా కనిపించినా లోపల పరస్పరం సహకరించుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ బీజేపీ నేతలు తమ ఢిల్లీ నాయకత్వానికి అతిగా విధేయత చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ అమిత్ షా చెప్పులు మోస్తారని, రామచందర్ రావు ఆయన కాళ్లు మొక్కుతారని ప్రస్తావించారు. ప్రజాసమస్యలపై పోరాడాల్సిన నాయకులు అధిష్ఠానం చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీల రాజకీయ వ్యవహారాలను ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి మాట్ల

అసెంబ్లీల నిన్ను బట్టలిప్పి నిలబెడతా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేటలో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగానికి శుక్రవారం తెలంగాణ భవన్‌లో కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే ఆధారాలతో సహా ప్రభుత్వ వైఫల్యాలను బయటపెడతానని సవాల్ విసిరారు. సిద్దిపేట సభలో అభివృద్ధి గురించి మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యం ఇచ్చారని మండిపడ్డారు. సీఎం ప్రసంగంలో కేసీఆర్ పేరును 63 సార్లు, తన పేరును 53 సార్లు, కేటీఆర్ పేరును 24 సార్లు ప్రస్తావించారని పేర్కొన్నారు. 26 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలను తరలించి భారీ సభ నిర్వహించారని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకే ఈ కార్యక్రమం పెట్టారని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టుగా మాట్లాడాలని సూచించారు. కృష్ణా జలాల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు వెయ్యి టీఎంసీల నీటిని వదిలేశారని, నాగార్జునసాగర్ కుడివైపు మరో టన్నెల్ నిర్మాణాన్ని అడ్డుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలోనూ ప్రభుత్వం సరైన సమయంలో స్పందించలేదన్నారు. పోతిరెడ్డిపాడు విస్తరణకు సంబంధించి కాంగ్రెస్ చరిత్రను వక్రీకరిస్తోందని మండిపడ్డారు. తాము 2005 జులై 4న మంత్రి పదవులకు రాజీనామా చేశామని, సంబంధిత జీవో సెప్టెంబర్ 13న వచ్చిందని గుర్తుచేశారు. అప్పట్లో అసెంబ్లీలో 40 రోజులపాటు పోరాడామని చెప్పారు. నాయిని నర్సింహారెడ్డిపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తుచేస్తూ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పట్లో పీజేఆర్ తమ పోరాటానికి మద్దతుగా నిలిచారని తెలిపారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీల కేటాయింపుల అంశంపై హరీశ్‌రావు సంచలన సవాల్ విసిరారు. ఈ నిష్పత్తికి బీఆర్ఎస్ శాశ్వతంగా అంగీకరించినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. నిరూపించలేకపోతే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి వదులుకోవాలని డిమాండ్ చేశారు. 2013 అక్టోబర్ 18న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జస్టిస్ శ్రీకృష్ణ కమిటీకి ఇచ్చిన నివేదికలోనే ఈ అంశం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతిని కలిసి రాష్ట్ర హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టును ఆశ్రయించి సెక్షన్ 3 కింద కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుకు ప్రయత్నించారని వివరించారు. 299 టీఎంసీల వాటా తాత్కాలిక ఏర్పాటేనని, శాశ్వత ఒప్పందం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్‌రావు విమర్శించారు. దేవాదుల పద్ధ 70 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశమున్నా ఉపయోగించుకోలేదన్నారు. కల్వకుర్తి, సీతారామ, పాలమూరు ప్రాజెక్టుల మోటార్లను ఎందుకు నడపలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ ప్రాజెక్టు నుంచి ఎన్ని టీఎంసీలు ఎత్తిపోశారు, మోటార్లు ఎన్ని గంటలు పనిచేశాయనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. పాలమూరు ప్రాజెక్టు మూడో ప్యాకేజీలో మిగిలిన పనులు పూర్తిచేస్తే 50 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు.

భారత్ పరువు తీస్తున్నారా?

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడటం రాహుల్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని అంతర్జాతీయ వేదికపై చెప్పడం దేశానికి నష్టం కలిగించే ప్రయత్నమని మండిపడ్డారు. వరుసగా వంద ఎన్నికల్లో ఓటములు ఎదురైనా కాంగ్రెస్ నాయకత్వం తన వైఖరిని మార్చుకోవడం లేదని ఎద్దేవా చేశారు. దేశ అభివృద్ధిని గుర్తించకుండా రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. దేశంలో రాజకీయ విభేదాలు ఉండొచ్చని, అయితే విదేశీ గడ్డపై భారత్ గురించి ప్రతికూలంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలకు అంతర్జాతీయ సంస్థల నివేదికలే సమాధానమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వంటి ప్రముఖ ఆర్థిక సంస్థలు భారత్ వృద్ధిపై సానుకూల అంచనాలు వెల్లడిస్తున్నాయని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశం ఆర్థికంగా నాశనమైందని ప్రచారం చేయడం వాస్తవాలను వక్రీకరించడమేనని విమర్శించారు. దేశ అభివృద్ధికి సంబంధించిన గణాంకాలను రాహుల్ గాంధీ గుర్తించాలని సూచించారు. భారత్‌ను బలహీనంగా చూపించేందుకు కొన్ని శక్తులతో కాంగ్రెస్ నాయకత్వం కలిసి పనిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా దేశ వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహించే వర్గాలతో రాహుల్‌కు సంబంధాలు ఉన్నాయని కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత పారిశ్రామిక రంగం కొత్త స్థాయికి చేరుకుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మేకిన్ ఇండియా కార్యక్రమంతో దేశీయ తయారీ రంగానికి భారీ ప్రోత్సాహం లభించిందన్నారు. రక్షణ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాల్లో ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగిందని వివరించారు. గతంలో అనేక వస్తువుల కోసం విదేశాలపై ఆధారపడిన భారత్ ఇప్పుడు సొంతంగా తయారీని విస్తరిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగం సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ భారత టెక్నాలజీ రంగం అవకాశాలను అందిపుచ్చుకుంటోందన్నారు. ముఖ్యంగా డేటా సెంటర్ల ఏర్పాటుకు భారత్ ప్రధాన గమ్యస్థానంగా మారుతోందని చెప్పారు. అంతర్జాతీయ కంపెనీలు భారత మార్కెట్‌పై ఆసక్తి చూపుతున్నాయని, ఈ మార్పులను గుర్తించకుండా దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల వ్యాఖ్యలు చేయడం సరికాదని విమర్శించారు. భారత్ ఆర్థికంగా మరో శ్రీలంక లేదా బంగ్లాదేశ్‌లా మారిపోవాలని రాహుల్ గాంధీ కోరుకుంటున్నట్లుగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో దేశం విదేశీ అప్పులపై ఎక్కువగా ఆధారపడే పరిస్థితులు ఉండేవని విమర్శించారు. అయితే 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఆర్థిక విధానాల్లో కీలక మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. దేశీయ ఉత్పత్తి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ పాత్ర బలపడటంతో అంతర్జాతీయంగా దేశానికి గౌరవం పెరిగిందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలు భారత నిర్ణయాలను ఆసక్తిగా గమనిస్తున్నాయని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం దేశ అభివృద్ధిని తక్కువ చేసి చూపించడం కాంగ్రెస్ నాయకత్వానికి తగదని కిషన్ రెడ్డి సూచించారు. దేశ భద్రత, అంతర్జాతీయ సంబంధాల విషయంలోనూ భారత్ తన సామర్థ్యాన్ని నిరూపించుకుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

రూ.6 కోట్ల నిధులు మంజూరైనా బేతోలుకు భద్రత కరువేనా?

- ప్రజల ప్రాణాల కంటే అధికారులకు ఫైళ్లే ముఖ్యమా?
- ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ లైన్.
- ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బీసీ కాలనీవాసుల బెంబేలు.
- నిధులున్నా లైన్ షిఫ్టింగ్ ఎందుకు చేపట్టడం లేదు?
- మున్సిపల్, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై మాజీ వార్డు సభ్యుడు షేక్ ఖాదర్ బాబా ఆగ్రహం

మహబూబాబాద్ జిల్లా
విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్







ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా అధికార యంత్రాంగం కదలకపోవడం ఎంతటి నిర్లక్ష్యం? హైటెన్షన్ విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ కోసం మున్సిపాలిటీకి రూ.6 కోట్ల భారీ నిధులు మంజూరైనట్లు చెబుతున్నా, మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు బీసీ కాలనీలో ప్రమాదకరంగా ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. నిధులు ఉన్నా పనులు ఎందుకు చేపట్టడం లేదు? ప్రజల ప్రాణ భద్రత అధికారులకు ఎందుకు పట్టదం లేదు? అంటూ 6వ వార్డు మాజీ సభ్యుడు షేక్ ఖాదర్ బాబా అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ఇళ్లపై హైటెన్షన్ వైర్లు.. నిత్యం ప్రాణభయమే!

బేతోలు బీసీ కాలనీలో మద్దినాల ఉపేంద్ర ఇంటి నుంచి నెల్లూరి వెంకన్న ఇంటి వరకు నివాస గృహాల మీదుగా ప్రమాదకరంగా 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ వెళ్తోంది. ప్రజల తలపై ప్రమాదకరంగా వేలాడుతున్న ఈ విద్యుత్ వైర్లు ఎప్పుడు ఏ ప్రమాదానికి దారితీస్తాయోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. గతంలో వర్షాల సమయంలో విద్యుత్ వైరు తెగి ఇళ్ల మధ్య పడటంతో టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయని, తృటిలో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు నివసించే ప్రాంతంలో ఇలాంటి ప్రమాదకర లైన్ ఉండటం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని విమర్శిస్తున్నారు. మరోసారి వైరు తెగి ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు.

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా..
పట్టించుకునే నాథుడే లేడు!

ప్రమాదకర విద్యుత్ లైన్‌ను తొలగించి మెయిన్ రోడ్డు వైపు మార్చాలని కోరుతూ ఫిబ్రవరి 27న విద్యుత్ శాఖ ఏఈకి, జూన్ 16న జిల్లా కలెక్టర్‌కు, జులై 7న విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయానికి వినతిపత్రాలు సమర్పించినట్లు షేక్ ఖాదర్ బాబా తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ప్రజలు ప్రమాదం అంచున జీవిస్తున్నా అధికారుల కార్యాలయాల్లో ఫైళ్లు కదలకపోవడం పాలనా నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

విద్యుత్ కోతలతో ప్రజలకు నరకం

బేతోలు గ్రామానికి మొగిలిచర్ల సబ్‌స్టేషన్‌లోని జగ్యా తండా ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుండటంతో రోజుకు రెండు నుంచి నాలుగు గంటల వరకు కోతలు విధిస్తున్నారని తెలిపారు. అప్రకటిత విద్యుత్ కోతలతో విద్యార్థులు చదువులకు ఆటంకం, రైతులకు వ్యవసాయ ఇబ్బందులు, గృహ వినియోగదారులకు తీవ్ర అసౌకర్యం ఎదురవుతోందని పేర్కొన్నారు. బేతోలు 6వ వార్డుకు మహబూబాబాద్ టౌన్ విద్యుత్ సరఫరా నుంచి నేరుగా కనెక్షన్ కల్పించి కోతల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

రూ.6 కోట్లలో బేతోలు వాటా ఎక్కడ?

హైటెన్షన్ లైన్ల షిఫ్టింగ్ కోసం రూ.6 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో, అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న బేతోలు 6వ వార్డుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని షేక్ ఖాదర్ బాబా స్పష్టం చేశారు. నిధులు కేటాయించినట్లు ప్రకటనలు చేయడం కాదు, ప్రజలకు క్షేత్రస్థాయిలో భద్రత కల్పించే పనులు చేపట్టాలని అన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలని, ఫీడర్ పనులు వేగవంతం చేయాలని ఇచ్చిన ఆదేశాలను స్థానిక అధికారులు అమలు చేయాలని కోరారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేసే బదులు ముందుగానే స్పందించి 11 కేవీ లైన్‌ను మెయిన్ రోడ్డు వైపు షిఫ్ట్ చేయాలని, విద్యుత్ కోతల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే బేతోలు గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రతకు భరోసా కల్పించాల్సిన అధికారులు ఇకనైనా కళ్లు తెరిచి తక్షణ చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

- చిల్డ్రన్స్ డే సందర్భంగా టోర్నమెంట్



కూకట్ పల్లి విశాల భారతి: చిల్డ్రన్స్ డే సందర్భంగా హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఎల్‌వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో చిన్నారులు ప్రతిభ కనబరిచారు. అండర్ 11, అండర్ 9 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారిణులు ఉత్సాహంగా పాల్గొని విజయాల కోసం పోటీపడ్డారు. అండర్ 11 సింగిల్స్ విభాగంలో లాసిని విజేతగా నిలిచింది. డబుల్స్ విభాగంలో లాసిని, ఫాతిమా జోడీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, మేధస్వి, ఆద్య జోడీ రన్నరప్‌గా నిలిచింది. అదేవిధంగా అండర్ 9 డబుల్స్ విభాగంలో జెస్సికా, తోషిత జోడీ విజేతలుగా నిలవగా, అన్నిని, జస్విత జోడీ ద్వితీయ స్థానాన్ని సాధించింది. చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, వారిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహించిన ఈ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారిణులను అభినందించారు.

రాంగ్ రూటులో వచ్చి పారిశుద్ధ్య కార్మికురాలికి స్కూటీ ఢీ



రాజేంద్రనగర్, విశాల భారతి : అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ పిల్లర్ నంబర్ 140 వద్ద గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 6.30 గంటల సమయంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికురాలు కే. రాధికను రాంగ్ రూటులో వచ్చిన స్కూటీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు, కంటికి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జోయ్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న రాధికను పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మహమ్మద్ ఆదిల్ అనే వ్యక్తి స్కూటీ (నంబర్ TS07EG6043) పై మద్యం మత్తులో రాంగ్ రూటులో వచ్చి పారిశుద్ధ్య కార్మికురాలు రాధికను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి కార్మికురాలి గాయాలకు కారణమైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైవేలపై విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఘటనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ) కృష్ణ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గాయపడిన కార్మికురాలికి తగిన న్యాయం జరిగేలా పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

అధికార అహంకారంతో మాట్లాడొద్దు

మొదటిపేజీ తరువాయి



మంచి స్థానం ఉందదని వ్యాఖ్యానించారు. అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించాలని సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్నుకున్న నాయకులు ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సాధారణ రాజకీయ విమర్శల కంటే ఎక్కువ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో భాగమైన ఎమ్మెల్యే ఇలాంటి హెచ్చరికలు చేయడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ముఖ్యంగా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం అంశాలను ఆయన తెరపైకి తీసుకొచ్చారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యల్లో మరో ఆసక్తికరమైన అంశం అయ్యప్ప స్వామిని ప్రస్తావించడం. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా ముఖ్య నాయకులకు మంచి ఆలోచనలు కలగాలని అయ్యప్ప స్వామిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాలకులు ధర్మబద్ధంగా, నిజాయితీగా వ్యవహరించేలా ఆత్మ విమర్శ చేసుకునే జ్ఞానాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. సాధారణంగా రాజకీయ నాయకులు విమర్శలకు ప్రతివిమర్శలు చేస్తుంటారు. కానీ రాజగోపాల్ రెడ్డి తన అభిప్రాయాలను ఆధ్యాత్మిక కోణంలో వ్యక్తం చేయడం ప్రత్యేకంగా నిలిచింది. అధికారం శాశ్వతం కాదని, ప్రజల నమ్మకమే నాయకులకు నిజమైన బలమనే సందేశాన్ని ఆయన వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం పాలకుల ప్రధాన బాధ్యత అని గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యలతో ప్రభుత్వ పనితీరుపై మరోసారి రాజకీయ చర్చ మొదలైంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఎవరిని లక్ష్యంగా చేసుకున్నాయనే అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఆయన ఎక్కడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును ప్రస్తావించలేదు. గత పాలకులను విమర్శించారా లేక ప్రస్తుతం అధికారంలో ఉన్న నాయకులను హెచ్చరించారా అనే విషయంలో స్పష్టమైన ప్రస్తావన చేయలేదు. అయితే అధికారంలో ఉన్నవారి ప్రవర్తన, అవినీతి, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించడంతో ఈ వ్యాఖ్యలు ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధించినవేనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకే చెందిన ఎమ్మెల్యే నుంచి ఇలాంటి ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవైపు ప్రభుత్వం తన అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేస్తుండగా, మరోవైపు సొంత పార్టీ నాయకుడి వ్యాఖ్యలు రాజకీయంగా కొత్త చర్చకు దారితీశాయి. తెలంగాణ కాంగ్రెస్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజకీయ వ్యాఖ్యలు ఎప్పుడూ ప్రత్యేకమైన చర్చకు దారితీస్తుంటాయి. మునుగోడు ఎమ్మెల్యేగా ఆయన తన అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేస్తుంటారు. తాజాగా ఉన్నత పదవుల్లో ఉన్న నాయకుల వ్యవహారశైలిపై చేసిన వ్యాఖ్యలు కూడా అదే తరహాలో రాజకీయ ప్రాధాన్యం పొందాయి. ముఖ్యంగా అధికారం, అవినీతి, ప్రజల విశ్వాసం, ఎన్నికల హామీల అమలు వంటి అంశాలను ఒకేసారి ప్రస్తావించడం గమనార్హం. ఈ ప్రకటనలో ఎవరి పేరు లేకపోయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చుట్టూ రాజకీయ చర్చ నడుస్తోంది. అయితే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యల ప్రధాన సారాంశం మాత్రం పాలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలనేదే. ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా అధికారం ప్రదర్శిస్తే రాజకీయంగా ఇబ్బందులు తప్పవనే హెచ్చరిక ఆయన మాటల్లో కనిపిస్తోంది.

లక్ష కుటుంబాలకు జీవిత బీమా భరోసా



- సంక్షేమ చరిత్రలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా సరికొత్త అధ్యాయం
- ఆపదలో ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే లక్ష్యం
- తొర్రూర్‌లో పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :

దేశ సంక్షేమ చరిత్రలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సరికొత్త అధ్యాయంగా నిలుస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఫంక్షన్‌హాల్‌లో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి ఆయన ఈ పథకాన్ని ప్రారంభించారు. లబ్ధిదారుల సమక్షంలో బటన్ నొక్కి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సుమారు లక్షా 20 వేల కుటుంబాలు ఉండగా, లక్షకు పైగా కుటుంబాలకు ఈ పథకం ఆర్థిక భరోసా కల్పించనుందని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని, బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొంటూ, గతంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, సన్నబియ్యం వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు పట్టించుకోవద్దని సూచించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా చూడాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిగ్లీపూర్ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ సర్పంచ్ మందుల విజయ శ్రీశైలం గౌడ్, చిన్న రవీర్యాల సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, లష్కర్ గూడ గ్రామ సర్పంచ్ అల్లే ఐలయ్య యాదవ్, జాఫర్ గూడ సర్పంచ్ ఎర్ర వెంకటేష్ యాదవ్, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సిద్దంకి కృష్ణ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జునతో పాటు అధికారులు ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల సెక్రటరీలు, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తేజస్వి కార్తీక వివాహ వేడుకల్లో పాల్గొన్న చిన్ననాటి స్నేహితులు



సికింద్రాబాద్, విశాల భారతి: పాటిల్ పూజ - పాటిల్ కృష్ణ దంపతుల పుత్రిక తేజస్వి వివాహం కార్తీక్‌తో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు చిన్ననాటి స్నేహితులైన మంద భవాని జగన్ దంపతులు హాజరై నూతన వధూవరులు తేజస్వి, కార్తీక్‌లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులందరూ ఒకచోట చేరి ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆడపు శివం, వేణు, సూరి, చక్రం, రామకృష్ణ, బాలకృష


ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన

- జిల్లా స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీల్లో 28 మంది విజేతలు

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీల్లో 28 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల (ఈఎల్‌సీ) ఆధ్వర్యంలో ఈ నెల 18న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయ ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ పోటీలను నిర్వహించారు. డోర్నకల్, మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు చెందిన 73 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో జెడ్పీ హెచ్ఎస్ కలపలకు చెందిన ఎస్. కేశవ్ మొదటి స్థానం సాధించగా, కేసముద్రం స్టేషన్ జెడ్పీ హెచ్ఎస్‌కు చెందిన టి. లావణ్య, జె. సాయిరాం రెండో స్థానం, మరిపెడ గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్‌కు చెందిన జె. దినేష్, అక్షయ మూడో స్థానం సాధించారు. మొత్తంగా క్విజ్ పోటీల్లో పది స్థానాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన పోటీల్లో కళాశాల స్థాయిలో కేజీబీవీ మహబూబాబాద్‌కు చెందిన ఎ. హర్షిణి మొదటి స్థానం, టీజీఎంఎస్ చిలుకోడుకు చెందిన డి. ఝాన్సీ రత్న రెండో స్థానం సాధించారు. పాఠశాల స్థాయిలో చిన్నగూడూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జి. కీర్తన మొదటి స్థానం, గూడూరు జెడ్పీ హెచ్ఎస్ (గర్ల్స్)కు చెందిన బి. యజ్ఞశ్రీ రెండో స్థానం సాధించారు. మొత్తం ఎనిమిది స్థానాల్లో విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల్లో ఎన్నికల చైతన్యం పెంపొందించడంలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు. విజేతలైన 28 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు, పోటీల్లో పాల్గొన్న మిగతా విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

గ్రూప్2, గ్రూప్3 అభ్యర్థులకు ఉచిత కోచింగ్

- మైనారిటీ అభ్యర్థులకు హైదరాబాద్‌లో ఫౌండేషన్ శిక్షణ
- దరఖాస్తులకు నవంబర్ 26 చివరి గడువు



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; ప్రభుత్వ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా గ్రూప్2, గ్రూప్3 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి.ఎ.వి. నాగలక్ష్మి వెల్లడించారు. డిగ్రీ పూర్తి చేసిన ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ మైనారిటీ అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా హైదరాబాద్‌లోని నాంపల్లి, గోపాల మహల్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9182540680, 9059050062, 04023236112 నంబర్లను సంప్రదించాలని నాగలక్ష్మి కోరారు. అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

మంచ్యతండలో గృహప్రవేశ వేడుకకు హాజరైన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

- వెంకన్న, పుష్పలత దంపతుల నూతన గృహప్రవేశం
- కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి



చిన్నగూడూర్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: చిన్నగూడూరు మండలం మంచ్యతండ గ్రామానికి చెందిన ధర్మసోత్ వెంకన్న-పుష్పలత దంపతుల నూతన గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ సత్యవతి రాథోడ్ హాజరై నూతన గృహంలోకి అడుగుపెట్టిన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వెంకన్న-పుష్పలత దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నూతన గృహంలో ఆనందం, అభివృద్ధి, ఐక్యత వెల్లివిరియాలని కోరుతూ కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. గృహప్రవేశ వేడుకలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొనడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల్లో ఆనందం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్, మాజీ జెడ్పీ చైర్మన్ బిందు అంగోత్, గుగులోత్ శ్రీరాం నాయక్, మాజీ ఎంపీపీ అరుణ రాంబాబు, మాజీ సర్పంచ్ వనజ శ్రీరాం, బాణోత్ శారద, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


గంజాయి అక్రమ రవాణాకు బయ్యారం పోలీసుల చెక్.. ముగ్గురు అరెస్ట్

- ఒడిశా నుంచి మహబూబాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత
- 1.3 కిలోల గంజాయి స్వాధీనం.. పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లు సీజ్

బయ్యారం విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను బయ్యారం పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశా రాష్ట్రంలోని పలిమెల గ్రామం నుంచి గంజాయి కొనుగోలు చేసి మహబూబాబాద్‌కు తరలిస్తుండగా సత్యనారాయణపురం రహదారిపై పోలీసుల వాహన తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితుల్లో ఇద్దరు మేజర్లు కాగా, మరొకరు జువైనైల్ ఉన్నట్లు గార్ల-బయ్యారం సీఐ రవీందర్ వెల్లడించారు. అరెస్టయిన వారిలో బానోత్ అరవింద్ (జగ్గా తండా), బానోత్ సన్నీ (బేతోల్ తండా)తో పాటు మరో జువైనైల్ ఉన్నారు. వీరు మహబూబాబాద్ నుంచి పల్సర్ బైక్‌పై ఒడిశాలోని పలిమెల గ్రామానికి వెళ్లి అక్కడ ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి తిరిగి మహబూబాబాద్‌కు తరలిస్తుండగా, బయ్యారం ఎస్ఐ ప్రశాంత్ బాబు నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 1 కిలో 300 గ్రాముల గంజాయి, అక్రమ రవాణాకు వినియోగించిన పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తగిన బహుమతి అందజేస్తామని స్పష్టం చేశారు.

ప్రతిజ్ఞ దివాస్ కబడ్డీ పోటీలు

- మోతె కస్తూర్బా పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు
- విజేతలకు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- జన్మదిన వేడుకల్లో బహుమతుల ప్రదానం



మోతె, విశాలభారతి: ప్రతిజ్ఞ దివాస్ కార్యక్రమంలో భాగంగా మోతె మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించారు. స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి శివకృష్ణ స్వేరో ఆధ్వర్యంలో, మండల అధ్యక్షులు దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి బాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతిజ్ఞ దివాస్ స్ఫూర్తితో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఈ పోటీల లక్ష్యమని తెలిపారు. కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలు పిల్లల్లో శారీరక దృఢత్వంతో పాటు జట్టు స్ఫూర్తిని పెంచుతాయని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 23వ.తేదీన జ్ఞాన యోధులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకల్లో బహుమతులు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

యాసంగిలో వరి సాగు వద్దు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- ఎల్‌నినో, వర్షా భావ పరిస్థితుల్లో తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యం
- కూరగాయలు, ఆయిల్‌పామ్, మల్బరీ, ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం
- పంట మార్పిడి రైతుల గుర్తింపునకు ప్రత్యేక యాప్

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్



ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండించే ఉద్యాన, కూరగాయలు, ఆయిల్‌పామ్, మిరప, మల్బరీ తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడంతో పాటు పంట మార్పిడి విధానాన్ని పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిస్తున్నారు. ఆయా పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయి సందర్శనలు చేపడుతున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పంట మార్పిడిని ప్రోత్సహిస్తూ ప్రతి మండలంలో అన్ని రకాల కూరగాయలు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, పూల తోటలు, మల్బరీ, చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజలు వంటి పంటలను సాగు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. నూతన పంటలైన ఔషధ, సుగంధ తైల పంటలతో పాటు కొబ్బరి, కోకో, అవకాడో వంటి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు తమ అవసరాలకు, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేస్తూ అధిక ఆదాయం పొందేలా సూచిస్తున్నారు. ప్రతి గ్రామంలో బోర్లు, బావుల కింద కనీసం 50 ఎకరాల్లో ఆదాయం అందించే పంటలను సేంద్రియ పద్ధతులు, ప్రకృతి సేద్యంతో సాగు చేయాలని సూచిస్తున్నారు. పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటిస్తూ నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొంటున్నారు.

రైతుల గుర్తింపునకు పంట మార్పిడి ప్రత్యేక యాప్.

యాసంగిలో వరికి బదులుగా కూరగాయలు, మల్బరీ వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులను గుర్తించేందుకు పంట మార్పిడిపై ప్రత్యేక యాప్ రూపొందించనున్నారు. రైతులు ఆరు రకాల నీటి అవసరం తక్కువగా ఉండే పంటలను సాగు చేసేందుకు ముందుకు రావాలని సూచిస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు సమీప ఉద్యానవన అధికారులను సంప్రదించి బిందు సేద్యం, మల్చింగ్ తదితర పథకాల కింద అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

పొలం గట్ల నుంచి ఇంటి ముంగిట వరకు కూరగాయల సాగు

ప్రజలు ప్రతిరోజూ వినియోగించే కూరగాయలను రైతులు తమ పొలం గట్లపై, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్‌పామ్, పండ్ల తోటల్లో అంతర పంటలుగా సాగు చేయాలని సూచిస్తున్నారు. డాబాలపై, ఇంటి ముంగిట కూడా రోజువారీ అవసరాలకు సరిపడా కూరగాయలను సాగు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు విధానాలను రైతులు అవలంబించాలని చెబుతున్నారు. ప్రోట్రేలో నారు పెంపకం, ఎత్తు మడుల ఏర్పాటు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వినియోగం, వేప నూనె పిచికారీ, పసుపు రంగు అట్టల వినియోగం, సిఫారసు చేసిన ఎరువులను వాడటం వంటి పద్ధతులను పాటించాలని సూచిస్తున్నారు. పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్‌లో టమాటా సాగు చేపట్టడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, రైతులు కె. నాగేశ్వరరావు, ఎం. సంపత్ రెడ్డి, జి. సీతారాములు, జి. హరిసింగ్, జె. నాగన్న, ఫీల్డ్ అధికారి నర్మద తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జీవిత బీమా భరోసా




- మహబూబాబాద్ జిల్లాలో 69 కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- కుటుంబ పెద్దను కోల్పోయినా ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ మహబూబాబాద్ జిల్లాలో ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 69 కేంద్రాలను ఏర్పాటు చేసి అర్హులైన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీమా కేంద్రాన్ని కలెక్టర్ స్నేహ శబరిష్ శుక్రవారం పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో పడకుండా జీవిత బీమా భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. కుటుంబ పోషణ బాధ్యతలు నిర్వహించే వ్యక్తిని కోల్పోయినప్పుడు భార్యాపిల్లలు, ఇతర కుటుంబ సభ్యులకు ఎదురయ్యే ఆర్థిక సమస్యలను తగ్గించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భాల్లో పిల్లల చదువులు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు భారంగా మారుతాయని, అలాంటి విపత్కర పరిస్థితుల్లో బీమా ఆర్థిక అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం అందుబాటులో ఉండేలా జిల్లాలో 69 కేంద్రాలను ఏర్పాటు చేశామని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వినోద్, మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్, వైస్ చైర్మన్ సూర్నపు సోమయ్య, కౌన్సిలర్ నవీన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు భరోసా.. ఇందిరమ్మ జీవిత బీమా



- అంజనాపురం గ్రామపంచాయతీలో ప్రారంభం
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆవిష్కరణ

బూర్గంపాడు, విశాలభారతి:

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ జీవిత బీమా కార్యక్రమం బూర్గంపాడు మండలంలో తొలిసారిగా అంజనాపురం గ్రామపంచాయతీలో ప్రారంభమైంది. పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, కుటుంబాల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా జీవిత బీమా భరోసాగా నిలుస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం వివరాలను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బూర్గంపాడు మండలంలో అంజనాపురం గ్రామపంచాయతీ ద్వారా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం విశేషంగా నిలిచింది. ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించి, అర్హులైన వారందరికీ అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆర్.కె.వి. ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, జీపీఓ అధికారి అనూష, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అధికారుల సమన్వయం, నాయకుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాల భారతి, సిటీబ్యూరో :



రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, గురువారం ఢిల్లీలో భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ రవాణా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో రెండు రోజుల పాటు ధర్నా నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రభుత్వ, ప్రైవేట్ రవాణా రంగ కార్మికులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడరీను వాహన సంఘాల ప్రతినిధి బృందం కలిసి రవాణా కార్మికుల సమస్యలు, దీర్ఘకాలిక డిమాండ్లపై చర్చించింది. ఈ ధర్నాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

లాఠీఛార్జ్‌పై వరికుప్పల అశోక్ ఆగ్రహం

- మీడియా ప్రతినిధులపై దాడి చేయడం అప్రజాస్వామికం
- జర్నలిస్టుల హక్కులను కాపాడాలి
- ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరపాలి



విశాల భారతి ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా బొంగులూరు సమీపంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థి కార్తీక్ (16) మృతి. ఈ ఘటనపై వార్త సేకరణకు వెళ్లిన జర్నలిస్టులపై ఆదిభట్ల పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని టీయూడబ్ల్యూజే 143 (తెలంగాణ ఎంప్లాయీస్ అండ్ జర్నలిస్ట్స్ యూనియన్ -తెంజు) ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు వరికుప్పల అశోక్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన బాధ్యతతో వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం తీవ్రంగా బాధాకరమని అన్నారు. విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధుల పట్ల పోలీసులు సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థి మృతి ఘటనపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సింది పోయి, వార్త సేకరణకు వెళ్లిన జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సరైన చర్య కాదని అన్నారు. జర్నలిస్టులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించుకునే వాతావరణం కల్పించాలని, మీడియా ప్రతినిధుల హక్కులను గౌరవించాలని కోరారు. జర్నలిస్టులపై జరిగిన లాఠీఛార్జ్ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వరికుప్పల అశోక్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ బీమా పథకంపై హర్షం

- సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం
- పేద కుటుంబాలకు భరోసా కల్పించే గొప్ప పథకమన్న పండుగుల రాజు



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని పెద్ద అంబర్‌పేట్ 52వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పండుగుల రాజు అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఈ గొప్ప సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌తో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పండుగుల రాజు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పిగ్లిపూర్ సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మగూడ సర్పంచ్ జాఫర్, గూడ సర్పంచ్ ఎర్ర వెంకటేష్ యాదవ్, అబ్దుల్లాపూర్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, మాజీ కౌన్సిలర్ సుప్రసేన రెడ్డి తో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలి





- సర్వేనెంబర్ 111/5/1, ఎకరం 1.03 GTS ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని తాసిల్దార్‌కి మెమోరాండం
- ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల ఐక్య వేదిక డిమాండ్

భద్రాచలం: విశాల భారతి:

స్థానిక శాంతినగర్ కాలనీ, భద్రాచలం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 111/5/1లో గల [1ఎకరాలు/03 గంటల] విస్తీర్ణం కలిగిన విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా తక్షణమే కాపాడి, రక్షణ కల్పించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక భద్రాచలం తహశీల్దార్ గారికి ఐక్య వేదిక తరుపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు సామాజిక ఉద్యమకారులు అలవాల రాజా మాదిగ మాట్లాడుతూ.. భద్రాచల పట్టణంలో శాంతినగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిని పేద ప్రజల సంక్షేమానికి, భవిష్యత్ ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాల్సిన ఈ సర్వే నెంబర్ 111/5/1 గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు అక్రమార్కులు సర్వేనెంబర్ బోర్డు తొలగించి, చెరువును పూడ్చి, ముళ్ళ పొదలను తొలగించి, మట్టితో పూడ్చి చదును చేస్తూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తహశీల్దార్ తక్షణమే స్పందించి సదరు భూమికి సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని, చుట్టూ కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేసి 'ప్రభుత్వ భూమి' అని తెలిపే హెచ్చరిక బోర్డులను పెట్టాలని కోరారు. ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఇల్లు ఇంటి స్థలం లేని పేద ప్రజల తరపున పోరాటం చేయాల్సి వస్తుందని అన్నారు.

కరువు కోరల్లో రైతులు.. రాజకీయ కబుర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం

- ముందస్తు హెచ్చరికలు బేఖాతరు
- 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం.
- ఇప్పుడు కేంద్రం సాయం కోసం పరుగులు!
- గోదావరి నీళ్లను సద్వినియోగం చేసుకోలేని పాలకులు
- కరువు నివారణలో ఘోర వైఫల్యం
- రైతుల కన్నీళ్లకు సమాధానం చెప్పాలి
- రాజకీయ విమర్శలతో బాధ్యతల నుంచి తప్పించుకోలేరు
- గౌని ఐలయ్య తీవ్రస్థాయి నిలదీత

మహబూబాబాద్ జిల్లా
విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.



రాష్ట్రంలో కరువు తీవ్రత రోజురోజుకు పెరుగుతూ రైతాంగం పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోతుంటే, ప్రజలను ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ విమర్శలు, ప్రతిపక్షంపై ఎదురుదాడులతో కాలక్షేపం చేస్తోందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు అప్రమత్తం కాలేదని, లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నారైతులకు తక్షణ ఉపశమనం కల్పించడంలో ఎందుకు విఫలమైందని నిలదీశారు. కరువు నివారణలో చేతులెత్తేసి, ఇప్పుడు కేంద్రం సాయం కోసం డిమాండ్లు చేయడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కరువు కాంగ్రెస్ తీసుకొచ్చిందని బీఆర్ఎస్, ఎల్నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కరువు ఏర్పడిందని కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని, ఈ రాజకీయ దుమారం మధ్య రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల విమర్శలకు రాజకీయంగా సమాధానం చెప్పడం కాదు..రైతుల పొలాలకు నీళ్లు అందించి,నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి,కరువు బాధిత కుటుంబాలకు భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని స్పష్టం చేశారు.

ముందే ముప్పు తెలుసు..
అయినా ప్రభుత్వం ఎందుకు మొద్దునిద్ర?

ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని నిపుణులు ముందుగానే హెచ్చరించినా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు కరువు ప్రణాళిక రూపొందించడంలో నిర్లక్ష్యం చేసిందని ఐలయ్య విమర్శించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన తర్వాత జూలై 18న 27 మంది సభ్యులతో నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, జూలై 30న నివేదిక తెప్పించుకున్న ప్రభుత్వం.. ఆ నివేదికలోని కీలక సూచనలను అమలు చేయడంలో ఎందుకు చొరవ చూపలేదని ప్రశ్నించారు. పంటల వైవిధ్యీకరణ, పంట రుణాల రీషెడ్యూల్, కరువును తట్టుకునే విత్తనాల పంపిణీ, డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీ తదితర చర్యలతో రూ.802 కోట్ల ప్రాథమిక కార్యాచరణను నిపుణుల కమిటీ ప్రతిపాదించిందన్నారు.రైతులు సాగులో కీలక దశను దాటిన తర్వాత కమిటీలు వేయడం, నివేదికలు తెప్పించుకోవడం, వాటిని అమలు చేయకుండా పక్కన పెట్టడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. కరువు వస్తుందని ముందే తెలిసినా పంటలను కాపాడేందుకు సిద్ధం కాలేని ప్రభుత్వం.. పంటలు ఎండిపోయాక సమీక్షలు చేస్తే రైతులకు ఏం ఉపయోగం? ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పుడు ప్రణాళిక ఎందుకు రూపొందించలేదు? నిపుణుల నివేదికలను ఎందుకు అమలు చేయలేదు? అని నిలదీశారు.

25 లక్షల ఎకరాల్లో పంట నష్టం..
రైతులకు దిక్కెవరు?

వర్షాభావ పరిస్థితుల కారణంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయని, రైతులు పెట్టుబడులు కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఐలయ్య అన్నారు. భూగర్భ జలాలు పడిపోవడం, విద్యుత్ కోతలు, సాగునీటి కొరతతో రైతాంగం అల్లాడుతున్నా ప్రభుత్వం సకాలంలో స్పందించలేదని విమర్శించారు. అక్టోబర్ 19న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం, అనంతరం 31 జిల్లాల్లో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. కరువు మండలాలుగా ప్రకటిస్తే రైతుల నష్టాలు తీరిపోతాయా? ప్రకటనలు చేస్తే ఎండిపోయిన పంటలు తిరిగి పండుతాయా? కరువు మండలాల జాబితాలో పేరు చేర్చినంత మాత్రాన రైతుల అప్పులు మాఫీ అవుతాయా? అని ప్రశ్నించారు. కరువు ప్రకటనలకే ప్రభుత్వం పరిమితమైతే రైతులకు మిగిలేది కన్నీళ్లు, అప్పులు, ఆత్మవేదనేనని హెచ్చరించారు.

కేంద్రం రూ.20 వేల కోట్లు ఇవ్వాలి అంటున్నారు..
రాష్ట్రం తన బాధ్యత ఏం నిర్వర్తించింది?

కరువు సహాయక చర్యల కోసం కేంద్రానికి రూ.20 వేల కోట్ల ప్యాకేజీ కోరుతున్న ప్రభుత్వం, రాష్ట్రంలో రైతులను ఆదుకునేందుకు ఇప్పటివరకు ఎన్ని నిధులు ఖర్చు చేసింది? ఎన్ని కుటుంబాలకు సాయం అందించింది? ఎంతమంది రైతులకు పంట నష్టపరిహారం చెల్లించింది? అనే వివరాలు ఎందుకు వెల్లడించడం లేదని ఐలయ్య నిలదీశారు. ఉపాధి హామీ పని దినాలను పెంచాలని, భూగర్భ జలాల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు, ప్రాజెక్టుల అభివృద్ధికి మరో రూ.5 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్న ప్రభుత్వం.. రాష్ట్రంలో తక్షణ సహాయక చర్య- --

జీవిత బీమా ప్రారంభించిన ఆకుల ఇంద్రా సేనారెడ్డి



చౌటుప్పల్, విశాల భారతి: చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం 8వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఘనంగా ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, స్థానిక కౌన్సిలర్ బద్రి గాలయ్య కలిసి ఈ పథకం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ...కుటుంబాన్ని పోషించే వ్యక్తికి ఏదైనా జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఆదుకోవడానికే ప్రభుత్వం రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. వార్డులో అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకంలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ బద్రి గాలయ్య మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి ఈ పథకాన్ని తీసుకెళ్తామని, ఎవరూ మిస్ కాకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, వార్డు అధ్యక్షులు పాశం శ్రీనివాస్,నాయకులు గోపనబోయిన నరసింహ యాదవ్, ఎర్ర శంకర్, బద్రి బాలరాజు, దేశట్ల లింగస్వామి, కడుపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

లక్కారంలో బాలికల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం



చౌటుప్పల్,విశాల భారతి: మండలం లక్కారం గ్రామంలోని సాజన్ పబ్లిక్ స్కూల్లో బాలికల భద్రత, విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ దివ్యాంగుల వయో వృద్ధులు సంక్షేమ శాఖ, జస్ట్ రైట్స్, స్కోప్ ఎన్జీవో మరియు షి టీం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత మరియు బాల వివాహాలు, ట్రాఫికింగ్, చైల్డ్ లేబర్, ఫోక్సో చట్టం, డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరంగా అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ నంబర్ల గురించి వివరించారు. నిరంతరం అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని, ప్రతి బాలికకు సమాన అవకాశాలు, సురక్షిత వాతావరణం కల్పించడానికి సమాజం మొత్తం కలిసికట్టుగా పనిచేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. టోల్ ఫ్రీ నంబర్ వాల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్ (హబ్) భార్గవి, స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ గారు, ఉపాధ్యాయుల బృందం, షీ టీం నుండి రవీందర్ రెడ్డి మరియు షీ టీం సభ్యులు, స్కోప్ మండల కోఆర్డినేటర్ బి. నరసింహ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంతింటి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

- పెద్దతండాలో ఆత్మీయంగా సాగిన గృహప్రవేశ వేడుక
- కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య సందడి




కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: డోర్నకల్ నియోజకవర్గం, కురవి మండలం పెద్దతండాలో నిర్వహించిన సొంతింటి గృహప్రవేశ వేడుకలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. తన స్వగృహంలో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన గృహంలోకి అడుగుపెట్టారు. సొంతింటి కల సాకారమైన సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల మధ్య వేడుక ఆనందోత్సాహాలతో ఘనంగా సాగింది. ఇంటి ఆవరణలో ఆత్మీయ పలకరింపులు, సంతోషకర వాతావరణం నెలకొనగా, కుటుంబ అనుబంధాలు, ఆత్మీయతకు ఈ వేడుక ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గుగులోత్ శ్రీరాం నాయక్ (బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు), మాజీ సర్పంచ్ వనజ, గుగులోత్ రఘురామ్, శాంతి, డాక్టర్ రాణాప్రతాప్, భానోత్ జగదీష్, శారద, కనికమ్మ, కాంతమ్మ తదితరులు పాల్గొని గృహప్రవేశ వేడుకలో భాగస్వాములయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయుల సమక్షంలో సత్యవతి రాథోడ్ నూతన గృహప్రవేశ వేడుక సంతోషంగా, వైభవంగా జరిగింది.

బాలానగర్‌లో ఘనంగా 'చేయూత' పింఛన్ల పత్రాల పంపిణీ



కూకట్ పల్లి విశాల భారతి: రాష్ట్రంలోని నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులు మరియు ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం బాలానగర్‌లో ఘనంగా జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలానగర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. సిఎంసీ (CMC) అధికారులతో కలిసి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండకింది పుష్ప రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పులి శివ కుమార్ గౌడ్ లబ్ధిదారులకు స్వయంగా పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులి శివ కుమార్ మాట్లాడుతూ.. 'చేయూత' పింఛన్ల పథకం కింద కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 4,206 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేయగా, అందులో ఒక్క బాలానగర్ డివిజన్‌లోనే 702 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి అన్నారు. వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలకు ఈ ఆర్థిక సహాయం అంద నుందని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మధు మోహన్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లా శివ, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాట్టే ప్రసన్న కుమార్, సీనియర్ నాయకులు ఎరుపుల మహేందర్, పులి శ్రీకాంత్ గౌడ్, రవి ముదిరాజ్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు కష్టాలు



విశాల భారతి, సిటీబ్యూరో: క్యాన్సర్... పేరు వింటేనే గుండెల్లో గుబులు పుడుతుంది.. శరీరాన్ని కబళించే వ్యాధితో పాటు ఆర్థికంగా, మానసికంగా రోగిని, వారి కుటుంబాన్ని కుంగదీసే ప్రాణాంతక సమస్య. అలాంటి వ్యాధితో పోరాడుతున్న పేద, మధ్యతరగతి రోగులకు ప్రభుత్వ వైద్యమే పెద్ద దిక్కు. ప్రైవేటు ఆసుపత్రుల్లో లక్షల రూపాయల ఖర్చుతో కూడిన చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేని రోగులు ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆశలుపెట్టుకుంటారు. కానీ సర్కార్ వైద్యశాలలే చేతులెత్తేస్తే వారి పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వేలాది మంది పేద క్యాన్సర్ బాధితులకు అండగా నిలవాల్సిన ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో కనీస మందులు లేక ఇబ్బందులు పడుతున్నామని రోగులు చెబుతున్నారు. వ్యాధితో ఒకవైపు పోరాడుతుంటే, మరోవైపు చికిత్సకు అవసరమైన మందులు, కనీస వైద్య సదుపాయాలు అందక తమపై అదనపు భారం పడుతున్నదని వాపోతున్నారు. ఎంఎన్‌జే ఆసుపత్రిలో మూడు నెలలుగా మల్టీవిటమిన్ మాత్రలు, పెయిన్ కిల్లర్లు అందుబాటులో లేవని రోగులు చెబుతున్నారు. ప్యాన్‌టాప్, జోఫర్ వంటి చికిత్సకు అవసరమైన మందులు కూడా దొరకడం లేదని వాపోతున్నారు. కీమోథెరపీ, ఇతర వైద్య ప్రక్రియల అనంతరం కలిగే దుష్ప్రభావాలను నియంత్రించడానికి, నొప్పి నుంచి ఉపశమనం కోసం వైద్యులు సూచించే మందులు అందుబాటులో లేకపోవడం ఇబ్బందులకు దారితీస్తున్నదని వారు తెలిపారు. ఇప్పటికే వ్యాధి బాధతో ఇబ్బంది పడుతున్న రోగులకు బయట మందులు కొనుగోలు చేయాల్సి రావడం అదనపు ఆర్థిక భారంగా మారుతున్నదని పేర్కొన్నారు. హాస్పిటల్‌లో సీటీ స్కాన్ విభాగానికి సంబంధించిన ఫిల్మ్‌ల కొరత కూడా వేధిస్తున్నదని రోగులు చెబుతున్నారు. స్కాన్ చేసినప్పటికీ ఫిల్మ్‌లు అందుబాటులో లేక వైద్యులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న ధరలతో సామాన్యుడి బతుకు భారం



- నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు తగ్గించాలి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

రాజేంద్రనగర్, విశాల భారతి :

నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా, అందుకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ స్థాయి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ఇంటి అద్దెలు, నివాస నిర్వహణ ఖర్చులు, తాగునీరు, విద్యుత్, ఇంధన ధరలు ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, వ్యాపారులు అక్రమంగా సరుకులు నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం, ఇష్టానుసారంగా ధరలు పెంచడాన్ని అరికట్టాలని కోరారు. రేషన్ దుకాణాలు, రైతు బజార్ల ద్వారా బియ్యం, పప్పులు, కూరగాయలు, వంటనూనెలు తదితర నిత్యావసర వస్తువులను సబ్సిడీ ధరలకు ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. సైబరాబాద్ పరిధిలో సంపన్న వర్గాలకు, అల్పాదాయ వర్గాలకు మధ్య ఆర్థిక వ్యత్యాసం అధికంగా ఉందని, గృహ సహాయకులు, భద్రతా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, రోజువారీ కూలీలు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెరుగుతున్న ఖర్చులతో కుటుంబాలను పోషించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయమైన వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మరోవైపు క్యాపిటల్ వ్యాల్యూ ఆధారంగా ఆస్తి పన్ను లెక్కించడం వల్ల ఇంటి యజమానులపై అదనపు భారం పడుతోందని, ఆ ప్రభావాన్ని అద్దె రూపంలో అద్దెదారులపై మోపుతున్నారని విమర్శించారు. దీంతో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఇంటి అద్దెల పెంపుపై పారదర్శక విధానం తీసుకురావడంతో పాటు ఆస్తి పన్ను విధానాన్ని సమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో తాగునీటి కొరత, ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి, అపార్ట్‌మెంట్లలో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణ ఖర్చులు, ఇంధన ధరల పెరుగుదల ప్రజలపై మరింత ఆర్థిక భారాన్ని మోపనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సరసమైన ధరలకు తాగునీరు సరఫరా చేయాలని, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణ ఖర్చులను తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. 2026 అక్టోబర్ ద్రవ్యోల్బణ గణాంకాల ప్రకారం తెలంగాణలో ఆహార ద్రవ్యోల్బణం 11.66 శాతానికి చేరగా, జాతీయ సగటు 8.94 శాతంగా నమోదైందని, రాష్ట్రంలో మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణం 7.26 శాతంగా ఉందని నాయకులు గుర్తుచేశారు. కూరగాయలు, పప్పులు, బియ్యం, చక్కెర, వంటనూనెల ధరల పెరుగుదలతో సామాన్యుల కొనుగోలు శక్తి తగ్గిపోతోందన్నారు. ప్రభుత్వం గణాంకాలకే పరిమితం కాకుండా ప్రజలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు చూపాలని డిమాండ్ చేశారు. రోజువారీ కూలీలు, గృహ సహాయకులు, కాంట్రాక్టు ఉద్యోగులు, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక భద్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. నిత్యావసర ధరల నియంత్రణ, వేతనాల పెంపు, అద్దెల నియంత్రణ, తాగునీటి సరఫరా, నివాస నిర్వహణ ఖర్చుల తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఆర్థిక ఉపశమనం కల్పించాలని బీఆర్ఎస్ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, రామ్ సుబ్బారెడ్డి, మహమ్మద్ ఆరిఫ్, సుమనళిని, యాలాల కిరణ్, బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సర్పంచ్ గౌరి శ్రీనివాస్ చేతులమీదుగా ఇందిరమ్మ భీమా ప్రారంభం

చౌటుప్పల్,విశాల భారతి: పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ భీమా పథకాన్ని గ్రామంలో ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ చేతులమీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది.అర్హులైన లబ్ధిదారులకు భీమా పత్రాలను చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... కుటుంబ పెద్ద అకస్మాత్తుగా మరణించినా, ప్రమాదానికి గురైనా ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఆదుకోవడానికే ఇందిరమ్మ భీమా పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరి, భీమా సౌకర్యాన్ని పొందాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఏ ఒక్క అర్హుడూ ఈ పథకానికి దూరం కాకూడదని, పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు వేగంగా అమలవుతున్నాయని, ఇందిరమ్మ భీమా కూడా ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసియస్ డైరెక్టర్ సుగుణమ్మ, వార్డు మెంబర్లు ఉదరి రమేష్, బొమ్మ స్వేత, బొమ్మ అమరావతి మరియు గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిరుపేదల కుటుంబాలకు ప్రభుత్వం ధీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

- కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్,సందగల్ల విజయ సతీష్ కో-అప్షన్ సభ్యులు



చౌటుప్పల్,విశాల భారతి: నిరుపేదల కుటుంబాలకు ప్రభుత్వం ధీమా కల్పించేందుకే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 14వ వార్డులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, కోఆప్షన్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జ్యోతి రమేష్ గౌడ్ మాట్లాడుతూ,పేదల పక్షాన ఆలోచించే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. నిరుపేదల కుటుంబాలలో యజమాని మృతిచెందితే, కుటుంబ సభ్యులకు భీమా వర్తించేలా ప్రభుత్వం ఈ బీమాను తీసుకువచ్చిందన్నారు. రూ.5 లక్షల బీమా ప్రయోజనం అందించడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ డైరెక్టర్ పర్కాల రవి,వార్డు ఇంచార్జ్ బొంగు వెంకటేష్, ఊదరి స్వామినాధం, వార్డు ప్రజలు కామిశెట్టి చంద్రశేఖర్, వరగంటి శ్రీను, వరగంటి భాను, ఎస్ కే మున్నా, చెరుకు రాజు, జిట్టగోని శ్రీను, తడకమళ్ళ శ్రీనివాస్ గుప్త, చెన్నగోని శివ గౌడ్, అప్పిడి శేఖర్ రెడ్డి, ఊడుగు నవీన్ కుమార్, జోర్రిగల ఆంజనేయులు, కొయ్యల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిగూడెంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల ప్రారంభం

- గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- సుర్వి మల్లేష్ గౌడ్ సర్పంచ్,ఫోరమ్ మండల అధ్యక్షులు



చౌటుప్పల్,విశాల భారతి: మండలంలొని అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఫోరం చౌటుప్పల్ మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ... కుటుంబాన్ని పోషించే వ్యక్తికి ఏదైనా జరిగితే ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఆదుకోవడానికే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి, కుటుంబాన్ని పోషించే యజమానులు అర్హులు.ఆధార్ కార్డులో నమోదైన వయస్సు ఆధారంగా అర్హతను పరిగణిస్తారు.రేషన్ కార్డు ఉన్నా, లేకపోయినా అర్హులే. అర్హులైన గ్రామ ప్రజలు ఆధార్ కార్డు, కొత్త రేషన్ కార్డు (ఉన్నట్లయితే) తీసుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తులకు చివరి తేదీ: 20 డిసెంబర్ 2026 వరకు..

గంగాపురం పాండు గౌడ్ పంచాయతీ కార్యదర్శి, బొల్లు అండాలు ఆశా వర్కర్, పెండం లక్ష్మి మహిళా సంఘం అధ్యక్షురాలు, కారోబార్ శివాజీ, గ్రామ మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

11వ రోజు ఘనంగా నిత్య అన్నదాన కార్యక్రమం

- అయ్యప్ప, శివ, భవానీ, హనుమాన్ భక్తులకు అన్నదాన సేవలు



విశాల భారతి, ఎల్ బి నగర్ : శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని శ్రీ మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో 11వ రోజు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర శివ స్వాముల అధ్యక్షులు శివగురు స్వామి సతీష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ అన్నదాన సేవలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులు, శివ భక్తులు, భవానీ భక్తులు, హనుమాన్ భక్తులు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. భక్తులకు అన్నదానం చేయడం ద్వారా సేవాభావం, ఆధ్యాత్మిక ఐక్యతను చాటుతున్నట్లు తెలిపారు.

కోకాపేట్ ఔటర్‌పై ఘోర ప్రమాదం

- లారీని ఢీకొని క్షణాల్లో దగ్ధమైన విద్యుత్ కారు నలుగురికి తప్పిన ప్రాణాపాయం



రాజేంద్రనగర్, విశాల భారతి : రంగారెడ్డి జిల్లా కోకాపేట్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన విద్యుత్ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటన జరిగిన కొద్ది నిమిషాలకే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లోనే కారు పూర్తిగా దగ్ధమైంది. అయితే కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అప్రమత్తమై వెంటనే బయటకు దిగడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళితే.. కోకాపేట్ నుంచి పటాన్‌చెరువు వైపు వెళ్తున్న విద్యుత్ కారు ఔటర్ రింగ్ రోడ్డుపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారులో కొద్దిసేపటికే మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన కారులోని నలుగురు ప్రయాణికులు వెంటనే కిందకు దిగారు. చూస్తుండగానే మంటలు కారు మొత్తం వ్యాపించడంతో వాహనం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. అదృష్టవశాత్తూ నలుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో ఔటర్ రింగ్ రోడ్డుపై కొద్దిసేపు ఆందోళన నెలకొంది.

పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రశాంత్ కుమార్‌రెడ్డి

- నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన బంటి



విశాల భారతి, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వివాహ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి (బంటి) హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకల్లో పాల్గొని కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు.

ఘనంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం


- పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్ మానస వినయ్
- ఎంపీడీవో వసంతలక్ష్మి, ఎమ్మార్వో ప్రసాద్



విశాలభారతి ఇబ్రహీంపట్నం: మంచాల మండల కేంద్రంలోని మంచాల గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ బీమా పథకాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మానస వినయ్, ఎంపీడీవో వసంతలక్ష్మి, ఎమ్మార్వో ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న ఇందిరమ్మ బీమా పథకం ప్రజలకు ఎంతో భరోసా కల్పించే ముఖ్యమైన పథకమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రజలకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు మరింత చేరువవుతాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రజా సంక్షేమం, గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో మంచాల గ్రామపంచాయతీ నిరంతరం కృషి చేస్తుందని సర్పంచ్ మానస వినయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మానస వినయ్, ఉప సర్పంచ్ పందుగుల లింగం, వార్డు సభ్యులు నీళ్ల పారిజాత కృష్ణ, మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వసంతలక్ష్మి, తహసీల్దార్ (ఎమ్మార్వో) ప్రసాద్, మండల విద్యాధికారి రాందాస్, ఎంపీఓ వెంకటేష్, మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) ఉమారాణి, మండలంలోని వివిధ గ్రామాల గ్రామ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాల్మాకులలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం – ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్, విశాల భారతి : పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని శంషాబాద్ మండలం పాల్మాకుల గ్రామంలో ఘనంగా ప్రారంభించారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబానికి ఆధారంగా ఉండే యజమాని అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా వారి జీవన ప్రయాణానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. పేద కుటుంబాల భవిష్యత్తుకు భద్రత కల్పించడంతో పాటు కష్టకాలంలో వారికి ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల సంక్షేమం, సామాజిక భద్రత, పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎంపీడీవో, తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కరువు కాటుకు ప్రజలు బలికాకముందే ప్రభుత్వం మేల్కొనాలి

- డా.చిలకల శ్రీనివాస్ యాదవ్

చౌటుప్పల్, విశాలభారతి:



ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో రాబోయే రోజుల్లో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చే పరిస్థితులు ఏర్పడితే వాటిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసిందా? అని ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.

కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత సమీక్షలు నిర్వహించడం, ప్రజలు ఇబ్బందులు పడిన తర్వాత అధికారులను ఆదేశించడం, రైతులు పంటలు నష్టపోయిన తర్వాత పరామర్శించడం కాకుండా, సమస్యలు రాకముందే పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా? అని ఆయన నిలదీశారు.

కరువు కాటుకు ప్రజలు,రైతులు బలికాకముందే ప్రభుత్వం మేల్కొనాలి!

ప్రజలకు తాగునీరు అందించడానికి మిషన్ భగీరథ పథకం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అనేక గ్రామాలు, కాలనీలు నీటి సమస్యలను ఎదుర్కొంటున్నాయనే ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఇంటింటికీ నీరు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం, ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితులను ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వద్ద ఉన్న ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ఏమిటని, గ్రామాలు, పట్టణాల్లో నీటి నిల్వలు ఎంత ఉన్నాయి, చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, భూగర్భ జలాల పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించారా? నీటి ఎద్దడి ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారా? ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, కొత్త బోర్లు, పాత బోర్ల మరమ్మతులు, పైప్‌లైన్‌ల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించారా? అని ప్రశ్నించారు. సాగునీటి విషయంలో కూడా రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు, చెరువులు, కుంటల ద్వారా రైతులకు అవసరమైన నీరు అందించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని అడిగారు. నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోతే రైతులకు నష్టపరిహారం అందించే విధానం ఏమిటని, పంటల సాగు ప్రణాళికపై రైతులకు ముందస్తు అవగాహన కల్పిస్తున్నారా? అని నిలదీశారు.

కరువు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం కాదు.. కరువు రాకముందే చర్యలు తీసుకోవడమే నిజమైన ప్రజాపాలనని అన్నారు. ప్రజల ప్రాణాలకు, రైతుల పంటలకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నీరు ఎంతో కీలకమని, ఈ అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులు ఇప్పటికైనా సమగ్ర సమీక్ష నిర్వహించి ప్రజలకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు నీటి కోతలు..పాలకులకు పూర్తి జీతాలా? ఇదేనా ప్రజాస్వామ్యం?

ప్రజలు పన్నులు కడుతున్నారని, నీటి బిల్లులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారని, ఒక్కరోజు ఆలస్యమైతే జరిమానాలు కూడా భరిస్తున్నారని, మరి ప్రజలకు కనీస తాగునీరు అందించడంలో విఫలమైతే పాలకులు, అధికారులు బాధ్యత వహించరా? అని ప్రశ్నించారు. ప్రజలకు నీటి కోతలు విధిస్తే.. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించే ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల జీతాల్లోనూ కోత విధించే విధానం ఎందుకు ఉండకూడదని అన్నారు. ప్రజలకు ఒక న్యాయం.. పాలకులకు మరొక న్యాయమా? ఇదేనా ప్రజాస్వామ్యం? అని నిలదీశారు. ఓట్లు అడిగే సమయంలో ప్రజలు గుర్తుకొస్తారని, గెలిచిన తర్వాత ప్రజల కష్టాలు గుర్తుకు రావా? అని ప్రశ్నించారు. కరువు తలుపు తడుతున్న వేళ ప్రభుత్వం ఇప్పటికైనా అప్రమత్తమై తాగునీరు, సాగునీటి సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని, రైతులకు నష్టం జరగకుండా ముందస్తు ప్రణాళిక అమలు చేయాలని, గ్రామాలు మరియు పట్టణాల్లో నీటి సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని డా. చిలకల శ్రీనివాస్ యాదవ్, బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర పిఏసి సభ్యుడు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోని పాలనను ప్రశ్నించడం ప్రజల హక్కు అని, ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు తమ పోరాటం కొనసాగుతుందని డా. చిలకల శ్రీనివాస్ యాదవ్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా - తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ స్పష్టం చేశారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై డీజీపీకి ఫిర్యాదు

- పోలీసుల పక్షపాత వైఖరిపై చర్యలకు విజ్ఞప్తి
- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తగిన గౌరవం కల్పించాలి
- డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసిన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే



విశాల భారతి, ఎల్ బి నగర్ :

ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, కొందరు పోలీసు అధికారులు పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సి.వి. ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఫిర్యాదు చేశారు. గత మూడేళ్లుగా ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆయన డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. సెప్టెంబర్ 19, 2026న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జీఓ 118 కింద ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో తన చేతిలోని మైక్రోఫోన్‌ను ఓ వ్యక్తి బలవంతంగా లాక్కున్నా పోలీసులు జోక్యం చేసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి అధికారిక హోదా లేని వ్యక్తులకు వేదికపై ప్రాధాన్యత కల్పించారని ఆరోపించారు. అదేవిధంగా నవంబర్ 18, 2026న చంపాపేట మోడల్ మార్కెట్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలోనూ ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించి, తాను ప్రోటోకాల్ గురించి ప్రశ్నించినప్పుడు పోలీసులు తమ పట్ల దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు.

నలుగురు పోలీసు అధికారులపై చర్యలకు డిమాండ్

చైతన్యపురి సీఐ సైదులు, సరూర్‌నగర్ సీఐ శ్రీశైలం, ఎల్‌బీనగర్ డివిజన్ ఏసీపీ రవీందర్‌రెడ్డి, చైతన్యపురి డీఐ వెంకటేశ్వర్లుల ప్రవర్తనపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఫిర్యాదు చేశారు. బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్‌ను కచ్చితంగా పాటించేలా ఆదేశాలు జారీ చేయాలని డీజీపీని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను స్థానిక ఎమ్మెల్యేకు ముందుగానే తెలియజేసి, ప్రజాప్రతినిధి హోదాకు తగిన గౌరవం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన డీజీపీ సి.వి. ఆనంద్, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన కఠిన చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కార్మికురాలిపై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేయాలి

- వనస్థలిపురంలో పారిశుద్ధ్య కార్మికుల నిరసన
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్
- ఆలేటి ఎల్లయ్య, పారానంది శ్రీనివాసులు



విశాల భారతి, ఎల్ బి నగర్ : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్న దళిత మహిళ చందుపట్ల రమణపై దాడికి పాల్పడిన బాలకృష్ణను వెంటనే అరెస్టు చేయాలని జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనను నిరసిస్తూ శుక్రవారం వనస్థలిపురంలోని శ్రీ వెంకటరమణ కాలనీ చౌరస్తాలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య, కార్యదర్శి పారానంది శ్రీనివాసులు మాట్లాడుతూ.. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న చందుపట్ల రమణ (45) చెత్త సేకరిస్తున్న సమయంలో ఇసుక బస్తాను పైకి ఎత్తలేకపోవడంతో బాలకృష్ణ అనే వ్యక్తి కులం పేరుతో దూషిస్తూ సెంటరింగ్ కర్రతో ఆమె కాళ్లపై దాడి చేసినట్లు తెలిపారు. స్థానికులు అడ్డుకున్నప్పటికీ తిరిగి దాడికి ప్రయత్నించడం అమానవీయమని ఖండించారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

రోజువారీ కూలీపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న మహిళా కార్మికురాలిపై ఇలాంటి దాడికి పాల్పడటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలిని దూషించిన వారిపై కూడా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రధాన నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం, భద్రత కల్పించాలని, పారిశుద్ధ్య కార్మికులపై దాడులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎల్లమ్మ, అరుణ, సుగుణమ్మ, ధనమ్మ, సీతమ్మ, రమేష్, శ్రీను, మహేష్, బుచ్చమ్మ, అంజమ్మ, లక్ష్మీదేవి, రమణమ్మ, పకీరమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

సీబీఐటీలో ఇంజనీరింగ్‌పై ప్రాంతీయ సదస్సు



హైదరాబాద్, విశాలభారతి: సీబీఐటీలో 'అభియాంత్రిక శాస్త్రంలో ఉద్భవిస్తున్న ధోరణులు'పై 2వ ప్రాంతీయ సదస్సు హైదరాబాద్, నవంబర్ 20, 2026: హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 20, 2026న 'అభియాంత్రిక శాస్త్రంలో ఉద్భవిస్తున్న ధోరణులు' అనే అంశంపై 2వ ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. భారతీయ భాషల అభివృద్ధి, ప్రోత్సాహం కోసం ఏఐసీటీఈ ప్రవేశపెట్టిన 'ఏఐసీటీఈవాణి' పథకం కింద ఈ సదస్సు జరిగింది. సాంకేతిక విద్యలో భారతీయ ప్రాంతీయ భాషల వినియోగాన్ని ప్రోత్సహిస్తూనే, ఇంజనీరింగ్ మరియు సాంకేతిక రంగాల్లో వస్తున్న నూతన ఆవిష్కరణలపై చర్చించడానికి, విజ్ఞానాన్ని పంచుకోవడానికి వివిధ విద్యాసంస్థలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, పారిశ్రామిక నిపుణులు మరియు విద్యార్థులకు ఒక వేదికను కల్పించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. కళాశాల సాంస్కృతిక విభాగం 'చైతన్య లాస్య' విద్యార్థిని ప్రదర్శించిన అద్భుతమైన శాస్త్రీయ నృత్యంతో ప్రారంభోత్సవ వేడుకకు సంప్రదాయ శోభ చేకూరింది. అనంతరం అతిథులను వేదికపైకి ఆహ్వానించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీబీఐటీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రవీంద్ర రెడ్డి ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొని, పరిశోధన, ఆవిష్కరణలు మరియు విద్యా ప్రమాణాల పట్ల తమ సంస్థకున్న నిబద్ధతను వివరించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కె. వసంత్ విభాగపు విశిష్టతలను పరిచయం చేయగా, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ టి. శ్రీధర్ ఈ సదస్సు ముఖ్య ఉద్దేశాలు మరియు ప్రాముఖ్యతను తెలియజేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఈఆర్ టియూ మాజీ డైరెక్టర్, సీబీఐటీ మాజీ ఆర్ అండ్ డి సలహాదారు ప్రొఫెసర్ ఎ.డి. శర్మ గౌరవ అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీ చిన్న వీరభద్రుడు ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగులో స్ఫూర్తిదాయకమైన కీలకోపన్యాసం చేశారు. ఆధునిక శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని మాతృభాషలో అందించాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. ఈ సదస్సులో అత్యంత ఆసక్తికరమైన మరియు చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే, వక్తలందరూ తమ ప్రసంగాలను తెలుగులోనే వినిపించారు. అత్యంత క్లిష్టమైన ఇంజనీరింగ్ మరియు సాంకేతిక అంశాలను సైతం ప్రాంతీయ భాషల్లో సమర్థవంతంగా వివరించవచ్చని దీని ద్వారా నిరూపించారు. సాంకేతిక విద్యలో భారతీయ భాషలను ప్రోత్సహించడం మరియు శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తృత ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకురావడం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ సదస్సుకు విద్యా, పారిశ్రామిక రంగాల నుండి పలువురు ప్రముఖులు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. వారిలో ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శ్యామ్ సుందర్, చెస్ విశ్రాంత అసోసియేట్ డైరెక్టర్ శ్రీ పి. రాఘవేంద్ర రావు, స్పైక్ ఆర్ట్స్ . ఎఐ ప్రిన్సిపల్ రీసెర్చ్ ఇంజనీర్ డాక్టర్ ఎన్. జగన్నాథన్, మరియు కమిట్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రాంబాబు ఉన్నారు. వివిధ విద్యాసంస్థల నుండి అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు మరియు విద్యార్థులు ఈ సదస్సులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది విద్యాపరమైన చర్చలు, విజ్ఞాన మార్పిడి మరియు వృత్తిపరమైన సంబంధాలను పెంపొందించుకోవడానికి ఒక చక్కని వేదికగా నిలిచింది. అభియాంత్రిక శాస్త్రంలో ఉద్భవిస్తున్న ధోరణులు 2026 కోఆర్డినేటర్ డాక్టర్ డి. నాగదేవి వందన సమర్పణ చేస్తూ, కార్యక్రమం విజయవంతం కావడానికి తమ విలువైన సహకారం అందించిన అతిథులు, రిసోర్స్ పర్సన్లు, ప్రతినిధులు మరియు నిర్వాహక కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంజనీరింగ్ మరియు సాంకేతిక రంగాల్లో భారతీయ ప్రాంతీయ భాషల సమర్థవంతమైన వినియోగాన్ని ప్రోత్సహిస్తూనే, పరిశోధన, ఆవిష్కరణలు మరియు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడంలో సీబీఐటీకి ఉన్న నిబద్ధతను ఈ సదస్సు ప్రతిబింబించింది.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమం ప్రారంభం

- నార్సింగి సర్కిల్ పరిధిలో ఐదు కేంద్రాల ఏర్పాటు.. పరిశీలించిన డిప్యూటీ కమిషనర్



రాజేంద్రనగర్, విశాల భారతి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ప్రతి కుటుంబంలో ఒకరికి రూ.5 లక్షల జీవిత బీమా సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నవంబర్ 20వ తేదీ నుంచి నెల రోజులపాటు ఈ నమోదు ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో నార్సింగి సర్కిల్ కార్యాలయ పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని నార్సింగి డిప్యూటీ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నమోదు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకం ద్వారా ప్రయోజనం అందేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నార్సింగి సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్ల వారీగా ఐదు ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. మణికొండలోని సర్కిల్ కార్యాలయం (ల్యాంకో హిల్స్ పక్కన), నెక్నాంపూర్ కమ్యూనిటీ హాల్, నార్సింగి మున్సిపల్ కార్యాలయం, కోకాపేట కమ్యూనిటీ హాల్, గండిపేట వార్డు కార్యాలయంలో నమోదు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కేంద్రాల్లో దరఖాస్తుదారులు కార్యాలయ వేళల్లో సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. నమోదు సమయంలో తప్పనిసరిగా ఆహార భద్రత కార్డు, సంబంధిత దరఖాస్తుదారుడి మొబైల్ నంబరును వెంట తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న రూ.5 లక్షల జీవిత బీమా సదుపాయాన్ని అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి డిప్యూటీ కమిషనర్ కోరారు. నెల రోజులపాటు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో అర్హులైన వారందరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

జంగా గౌతమ్‌కు బసవరాజు శ్రీనివాస్ అభినందనలు

- ఏఐసీసీ కార్యదర్శిగా నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శిగా నియమితులైన శ్రీ జంగా గౌతమ్‌కు తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయ

ప్రశ్నలతో విసిగించాను

సూపర్‌స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నది అందాల తార రాశీఖన్నా. ఆ సినిమా లొకేషన్‌లో రజనీతో తన అనుభవాలను ఆసక్తికరంగా వెల్లడించారామె 'నా కెరీర్‌లో చాలామంది స్టార్లతో పనిచేశాను. ఇప్పుడు 'ధర్మన్'లో సూపర్‌స్టార్‌తో పనిచేస్తున్నాను. నిజానికి స్టార్‌డమ్ ఎంజాయ్ చేస్తున్న వారి ప్రవర్తన విభిన్నంగా ఉంటుంది. కానీ కొన్ని దశాబ్దాలుగా సూపర్‌స్టార్‌డమ్‌ని ఎంజాయ్ చేస్తున్న రజనీసార్ ఆటిట్యూడ్ వారందరికీ పూర్తి భిన్నం. నిజం చెబుతున్నా.. లొకేషన్‌లో రజనీసార్ నాకు ఫ్రెండ్ అయిపోయారు. సెట్‌లో ఆయన పక్కన ఉంటే చిన్నపిల్లలా మారిపోయేదాన్ని. ఆయనతో ఎంత చనువు ఏర్పడిందంటే.. ఒక్కోసారి ప్రశ్నలతో విసిగించేదాన్ని. ఆయన మాత్రం నవ్వుతూ ఓపిగ్గా సమాధానాలు చెప్పేవారు. అంత సూపర్‌స్టార్‌తో మాట్లాడాలంటే ఎవరికైనా బెరుకే. నేను మాత్రం ఆయన పక్కన కూర్చొని చాలా విషయాలు మాట్లాడేదాన్ని. ఏ మాత్రం గర్వం లేకుండా నిరాడంబరంగా ఉండే ఆయన్ను చూస్తుంటే చాలా ముచ్చటేసేది' అంటూ చెప్పుకొచ్చింది రాశీఖన్నా.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.